తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
కరీంనగర్ - నిజామాబాద్
రాజన్న సిరిసిల్ల | కామారెడ్డి
పెద్దపల్లి | జగిత్యాల
బుధవారం
02 సెప్టెంబర్ 2026
పేజీలు : 8
Follow :

## ఆసుపత్రిలో పారిశుధ్య సిబ్బంది డబ్బులు ఆశిస్తే కఠిన చర్యలు

### కలెక్టర్ కోయ శ్రీహర్ష

- రోగుల నుంచి డబ్బులు ఆశించినట్లు ఫిర్యాదులు వస్తే సంబంధిత సిబ్బందిని విధుల నుంచి తొలగిస్తాం
- మెరుగైన వైద్య సేవలతో ఎన్టీపీసీ, చెన్నూరు నుంచి కూడా జిల్లా ఆసుపత్రికి వస్తున్న ప్రజలు
- జిల్లా ఆసుపత్రిలోని అన్ని విభాగాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్



**పెద్దపల్లి,సెప్టెంబర్ 01(జనంసాక్షి) :** ఆసుపత్రిలో పారిశుధ్య సిబ్బంది డబ్బులు ఆశిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష హెచ్చరించారు. మంగళవారం జిల్లా ఆసుపత్రిని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి, ఆసుపత్రిలోని వివిధ విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. చిన్నపిల్లల వార్డు, గర్భిణీల వార్డు, ఎక్స్‌రే గది, ఔట్‌పేషెంట్ విభాగం, చికిత్స విభాగం, డెంటల్ విభాగం, ఇన్‌పేషెంట్ విభాగం, జనరల్ ఫిజీషియన్, ఆర్థోపెడిక్స్ తదితర అన్ని విభాగాలను ఆకస్మికంగా పరిశీలించారు. ఆయా విభాగాల్లో రోగులకు అందుతున్న వైద్య సేవలు, సిబ్బంది పనితీరు, పారిశుధ్య నిర్వహణ తదితర అంశాలను ఆయన పరిశీలించారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలపై రోగులు, వారి సహాయకుల నుంచి కలెక్టర్ నేరుగా ఫీడ్‌బ్యాక్ తీసుకున్నారు. వైద్యం, మందుల లభ్యత, పారిశుధ్యం, సిబ్బంది వ్యవహారశైలిపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ జిల్లా ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందుతున్నందుకు సంతృప్తి వ్యక్తం చేశారు. మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉండటంతో ఎన్టీపీసీ, చెన్నూరు ప్రాంతాల నుంచి కూడా ప్రజలు వైద్యం కోసం పెద్దపల్లి జిల్లా ఆసుపత్రికి వస్తున్నారని తెలిపారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి ఒక్కరికి నాణ్యమైన వైద్యం అందేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఆసుపత్రిలో పారిశుధ్య సిబ్బంది రోగుల నుంచి డబ్బులు ఆశిస్తున్నారనే ఫిర్యాదులు తరచుగా వస్తున్న నేపథ్యంలో ఆకస్మిక తనిఖీ నిర్వహించినట్లు కలెక్టర్ తెలిపారు. రోగుల నుంచి స్వీకరించిన ఫీడ్‌బ్యాక్‌ను పరిశీలించి ,ఫిర్యాదులు నిజమని తేలితే సంబంధిత సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి సహాయకుల నుంచి ఎలాంటి రూపంలోనూ డబ్బులు ఆశించరాదని పారిశుధ్య సిబ్బందిని హెచ్చరించారు. రోగుల వద్ద డబ్బులు డిమాండ్ చేయడం,ఆశించడం వంటి చర్యలను ఏమాత్రం ఉపేక్షించేది లేదన్నారు.పారిశుధ్య సిబ్బంది తమ పనితీరును మార్చుకుని బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఇకపై కూడా రోగుల నుంచి డబ్బులు ఆశిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తే సంబంధిత సిబ్బందిని విధుల నుంచి వెంటనే తొలగించేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఆసుపత్రి పరిసరాలు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. వైద్య సేవల నాణ్యత,రోగుల సంతృప్తిపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట డిజిహెచ్ఎస్ డాక్టర్ శ్రీధర్,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్అండ్‌బీ పనులను మార్చి నాటికి పూర్తి చేయాలి

### కలెక్టర్ కోయ శ్రీహర్ష

- పనుల నాణ్యతలో రాజీ లేకుండా నిర్దేశిత గడువులో పూర్తి చేయాలి
- ఆర్అండ్‌బీ పనుల పురోగతిపై ఏఈలు, డీఈలతో సమీక్షించిన కలెక్టర్



**పెద్దపల్లి,సెప్టెంబర్ 01(జనంసాక్షి) :** జిల్లాలో రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో అన్ని మండలాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను వచ్చే మార్చి నెలలోగా పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు.మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం లోని సమావేశ మందిరంలో ఆర్అండ్‌బీ శాఖ పనులపై జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని అన్ని మండలాల్లో జరుగుతున్న రహదారులు, భవనాలు, ఇతర ఆర్అండ్‌బీ పనుల పురోగతిని మండలాల వారీగా సమీక్షించారు.పనులు ప్రారంభం కానివి, వివిధ దశల్లో ఉన్నవి, పెండింగ్‌లో ఉన్న పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ జిల్లాలో చేపడుతున్న అన్ని ఆర్అండ్‌బీ పనులను వేగవంతం చేసి మార్చి నెలలోగా పూర్తి చేయాలని సూచించారు. పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. కాంట్రాక్టర్లతో సమన్వయం చేసుకుంటూ పనులు నిర్దేశిత గడువులోగా పూర్తయ్యేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రజలకు నాణ్యమైన మౌలిక వసతులు అందించడమే లక్ష్యంగా పనులు చేపట్టాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా రహదారి పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, పనుల నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడవద్దని అధికారులను ఆదేశించారు.నిబంధనల ప్రకారం పనులను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని,పనుల పురోగతి,నాణ్యత,బిల్లుల చెల్లింపులను సమర్థవంతంగా పర్యవేక్షించాలని సూచించారు.ప్రతి పనికి సంబంధించి క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు.ప్రతి మండలంలో చేపడుతున్న ఆర్అండ్‌బీ పనులకు సంబంధించి నిర్దిష్ట కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. ప్రారంభం కాని పనులు వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవడంతో పాటు,వివిధ దశల్లో ఉన్న పనులను వేగవంతం చేయాలని, పెండింగ్‌లో ఉన్న పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయడంతో పాటు ప్రజలకు ఉపయోగపడే విధంగా నాణ్యతతో కూడిన రహదారులు, భవనాలు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు.ఈ సమావేశంలో ఆర్అండ్‌బీ ఈ ఈ భావ్ సింగ్,ఏఈలు,డీఈలు,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నిజాంసాగర్ ప్రధాన కాలువకు నీటి విడుదల

**వానాకాలం పంటల సాగు అవసరాల కోసం సెప్టెంబర్ 2న మధ్యాహ్నం 1 గంటకు విడుదల**

**కాలువలో ప్రవాహం పెరగనున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**



**జనం సాక్షి నిజాంసాగర్:** నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి వానాకాలం పంటల సాగునీటి అవసరాల కోసం సెప్టెంబర్ 2న మధ్యాహ్నం 1 గంటకు ప్రధాన కాలువలోకి సాగునీటిని విడుదల చేయనున్నట్లు నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు.నీటి విడుదల అనంతరం ప్రధాన కాలువలో నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉన్నందున రైతులు, గొర్రెల కాపరులు, మత్స్యకారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పశువులు, గొర్రెలను కాలువలోకి దింపరాదని, కాలువలోకి దిగడం, ఈత కొట్టడం, కాలువను దాటేందుకు ప్రయత్నించడం చేయరాదని అధికారులు హెచ్చరించారు.కాలువ పరిసర ప్రాంతాలకు పిల్లలను ఒంటరిగా వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని, కాలువ గట్లు, తూములు, వంతెనలు, నీటి ప్రవాహ ప్రాంతాల వద్ద అవసరం లేకుండా సంచరించరాదని సూచించారు. నీటి ప్రవాహాన్ని చూడడం, ఫొటోలు, వీడియోలు తీసేందుకు కాలువకు దగ్గరగా వెళ్లడం ప్రమాదకరమని తెలిపారు.నీటి ప్రవాహం ఉన్న సమయంలో వ్యవసాయ పనుల కోసం కాలువలోకి ప్రవేశించవద్దని. అధికారులు తెలిపారు.

## కార్పొరేట్లకు కొమ్ముకాస్తున్న మోదీ ప్రభుత్వం: చాడ వెంకటరెడ్డి




**కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 01, ( జనంసాక్షి)** కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తూ ప్రజల సొమ్మును ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేస్తోందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి ఆరోపించారు. మంగళవారం కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.కార్పొరేట్ శక్తులకు రూ.22 వేల కోట్ల రుణాలు మాఫీ చేసిన కేంద్ర ప్రభుత్వం పేదలు, రైతుల రుణాల మాఫీ విషయంలో మాత్రం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. దేశంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలపై దాడులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.తెలంగాణకు గోదావరి జలాలు అందించేందుకు తుమ్మిడిహెట్టి వద్ద 152 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మించాలని ఆయన కోరారు. దీనివల్ల ఆదిలాబాద్‌తో పాటు ఉత్తర తెలంగాణ జిల్లాలకు సాగు, తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని అన్నారు. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కుమార్ మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి బ్యారేజీ నిర్మాణానికి కృషి చేయాలని సూచించారు. ధరణి పోర్టల్, 22ఏ కారణంగా రాష్ట్రవ్యాప్తంగా అనేక భూ సమస్యలు తలెత్తుతున్నాయని వెంకటరెడ్డి అన్నారు. నిషేధిత భూములకు అక్రమంగా పట్టాలు చేయించుకునే రియల్ ఎస్టేట్ దందాలపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రెవెన్యూ, ఇంజనీరింగ్, పోలీస్ తదితర శాఖల్లో అవినీతి పెరుగుతోందని ఆరోపించిన ఆయన, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తక్షణమే అధికార యంత్రాంగాన్ని ప్రక్షాళన చేసి పారదర్శక, జవాబుదారీ పాలన అందించాలని కోరారు.సెప్టెంబర్ 6 నుంచి 8 వరకు కరీంనగర్‌లో జరగనున్న ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కార్మిక లోకానికి పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

# సర్ ప్రక్రియలో క్లెయిమ్‌లు, అభ్యంతరాలను సెప్టెంబర్ 16లోగా సమర్పించాలి

- అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు
- జిల్లాలో ఇప్పటివరకు 1,49,194 నోటీసులు జనరేట్ చేయగా, అందులో 58,313 నోటీసులు ఓటర్లకు అందజేత
- వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సర్ కార్యక్రమంపై అవగాహన సమావేశం



**పెద్దపల్లి,సెప్టెంబర్ 01(జనంసాక్షి) :** సర్ కార్యక్రమంలో భాగంగా ప్రచురించిన డ్రాఫ్ట్ ఓటరు జాబితాపై క్లెయిమ్‌లు,అభ్యంతరాలను సెప్టెంబర్ 16 వరకు సమర్పించవచ్చని లిఅదనపు కలెక్టర్ బి.శ్రీరాములు తెలిపారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ బి.శ్రీరాములు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సర్ కార్యక్రమంపై అవగాహన సమావేశం నిర్వహించారు.సర్ ప్రక్రియలో చేపడుతున్న చర్యలు,డ్రాఫ్ట్ ఓటరు జాబితా, క్లెయిమ్‌లు,అభ్యంతరాలు,నోటీసులు,విచారణ తదితర అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు మాట్లాడుతూ డ్రాఫ్ట్ ఓటరు జాబితాపై వచ్చే క్లెయిమ్‌లు,అభ్యంతరాలన్నింటినీ నిబంధనల ప్రకారం పరిశీలించి పరిష్కరిస్తామని తెలిపారు. అర్హత కలిగిన ఏ ఓటరు పేరు కూడా జాబితాలో లేకుండా ఉండకూడదనే ఉద్దేశంతో సవరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.నో మ్యాపింగ్,అనామలీస్‌గా గుర్తించిన ఓటర్లకు నిబంధనల ప్రకారం నోటీసులు జారీ చేసినట్లు అదనపు కలెక్టర్ తెలిపారు.జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు మొత్తం 1,49,194 నోటీసులు జనరేట్ చేయగా, అందులో 58,313 నోటీసులను సంబంధిత ఓటర్లకు అందజేసినట్లు వెల్లడించారు.నోటీసు జారీ చేసిన తేదీ నుంచి ఏడు రోజుల అనంతరం సంబంధిత ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఆధ్వర్యంలో విచారణ నిర్వహిస్తామని చెప్పారు. నోటీసులు అందుకున్న ఓటర్లు నిర్దేశిత గడువులోగా విచారణకు హాజరై తమ ఓటు హక్కుకు సంబంధించిన ఆధారాలను సమర్పించాలని సూచించారు.ఓటు హక్కును క్లెయిమ్ చేసుకునే సమయంలో భారత ఎన్నికల సంఘం ఆమోదించిన 11 రకాల పత్రాల్లో ఒకదాన్ని ఆధారంగా సమర్పించాల్సి ఉంటుందని అదనపు కలెక్టర్ తెలిపారు.ఓటరు పుట్టిన తేదీకి సంబంధించిన నిబంధనల ప్రకారం అవసరమైన సందర్భాల్లో తల్లిదండ్రులకు సంబంధించిన రికార్డులు,ఆధార పత్రాలను సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో పేరు ఉన్న ప్రతి ఓటరు తన పేరు, వయస్సు, చిరునామా,ఇతర వివరాలను పరిశీలించు కోవాలని, వివరాల్లో ఏవైనా తప్పులు ఉన్నా,పేరు జాబితాలో లేకపోయినా,అర్హత లేని పేరు ఉన్నట్లు గుర్తించినా నిర్దేశిత విధానంలో క్లెయిమ్, అభ్యంతరాన్ని సమర్పించాలని తెలిపారు.సర్ ప్రక్రియలో భాగంగా బూత్ స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో ఓటర్లకు అవసరమైన సమాచారాన్ని అందించాలని,నోటీసులు అందుకున్న ఓటర్లకు విచారణకు హాజరయ్యే విధానం, సమర్పించాల్సిన పత్రాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ ప్రక్రియలో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా తమ పరిధిలోని ఓటర్లకు సర్ ప్రక్రియపై అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ కోరారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితాను పరిశీలించి, అర్హత కలిగిన ఓటర్ల పేర్లు నమోదు అయ్యేలా,అవసరమైన సవరణలు జరిగేలా తమ సూచనలు, అభ్యంతరాలను నిబంధనల ప్రకారం సమర్పించాలని,క్లెయిమ్‌లు,అభ్యంతరాల స్వీకరణ అనంతరం వాటిని సంబంధిత అధికారులు పరిశీలించి, అవసరమైన చోట విచారణ నిర్వహించి నిబంధనల ప్రకారం పరిష్కరిస్తారని అదనపు కలెక్టర్ తెలిపారు.ఓటర్లు సర్ ప్రక్రియను సద్వినియోగం చేసుకొని తమ ఓటు హక్కుకు సంబంధించిన వివరాలను సరిచూసుకోవాలని, అవసరమైన క్లెయిమ్‌లు,అభ్యంతరాలను సెప్టెంబర్ 16లోగా సమర్పించాలని,ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని, అర్హత కలిగిన ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా అధికారులు,రాజకీయ పార్టీలు, ప్రజలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.ఈ సమావేశంలో ఎన్నికల విభాగం అధికారులు విజయ్,ఐటి టెక్నికల్ కిరణ్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు,తదితరులు పాల్గొన్నారు.



## సేవా కార్యక్రమాలతో వ్యాల్ల శ్రావ్య పటేల్ జన్మదిన వేడుకలు..

### - తబితా పిల్లలకు అన్నదాన కార్యక్రమం..

### - నిరుపేదలకు భోజనం..

### - ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్ల పంపిణీ..

**గోదావరిఖని, జనంసాక్షి :** బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు వ్యాల్ల హరీష్‌రెడ్డి సతీమణి వ్యాల్ల శ్రావ్య పటేల్ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని రామగుండం నియోజకవర్గంలో పలు సేవా కార్యక్రమాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ నాయకులు మేకల రామస్వామి, కొండ సురేష్ ఆధ్వర్యంలో తబిత ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించి, కేక్ కట్ చేసి శ్రావ్య పటేల్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.అదేవిధంగా రౌతు గణేష్,ఎండీ తమీమ్, ఎండీ వాషిమ్ ఆధ్వర్యంలో నిరుపేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడంతో పాటు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు.జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమాలతో నిర్వహించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తూ, వ్యాల్ల శ్రావ్య పటేల్ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు అల్లి గణేష్, నిమ్మ రాజుల సాగర్, యువరాజ్ నేత,మేడం సతీష్, నిజాముద్దీన్, శివమిన్ను, మల్లేష్, ఆశ్రఫ్, రవితేజ, వషిమ్, ప్రణీత్, శ్రీనివాస్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## కొండగట్టు అంజన్న సన్నిధిలో జనసేన నాయకుల ప్రత్యేక పూజలు

**మల్యాల సెప్టెంబర్ 1 (జనంసాక్షి)** తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రం ముత్యంపేట గ్రామంలోని కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానంలో ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి,సినీ హీరో,జనసేన నాయకుడు పవన్ కళ్యాణ్ ముందస్తు జన్మదిన వేడుకలు మంగళవారం మెగా యూత్ ఫోర్స్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ కాస రాజు అద్వర్యంలో గోత్ర నామాల పై పూజ,లక్ష తమలపాకుల పూజ అర్చన అన్న ప్రసాద వితరణ ఘనంగా నిర్వహించారు.పవన్ కళ్యాణ్ ముందస్తు జన్మదిన వేడుకలకు కొండగట్టు ఆంజనేయ స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం జనసేన పార్టీ నాయకుడు గడల శ్రీనివాస్ మాట్లాడుతూ టీటీడీ నిధులనుంచి కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం అభివృద్ధి కొరకు కేటాయించిన దాదాపు 35 కోట్లరూ తెలంగాణ ఖజానాలో చేరాయని తెలిపారు.8 నెలలు గడుస్తున్న వసతి గృహాలకు ఎందుకు టెండర్ నిర్వహించట్లేదనేది దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులకే తెలియాలని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి మాజీ తెలంగాణ హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాస్,రాష్ట్ర మున్నారు కాపు సంఘ అధ్యక్షుడు కొండా దేవయ్య తెలంగాణ రాష్ట్ర ఫిల్మ్ ఛాంబర్ చైర్మన్ పి.రామకృష్ణ గౌడ్,రాష్ట్ర జనసేన నాయకులు, రాము యాదవ్, శ్రీరాముల సోమశేఖర్,శ్రీదేవి,మిర్యాల రామకృష్ణ, డాక్టర్ రాజ్ కిరణ్,బేకం జనార్దన్ మెగా అభిమాన సంఘం నాయకులు ఉమ్మడి జిల్లాలో ఉన్న జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.



# తెలంగాణ జలసిరి పనులను అక్టోబర్ నెలాఖరులోగా పూర్తి చేయాలి

## జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

### - ప్రతి గ్రామంలో పంట కుంటలు, ఇంకుడు గుంతలు, బోర్‌వెల్ రీచార్జ్ గుంతల నిర్మాణం వేగవంతం చేయాలి



**పెద్దపల్లి,సెప్టెంబర్ 01(జనంసాక్షి) :** గ్రామీణ ప్రాంతాల్లో భూగర్భ జలాలను పెంచే లక్ష్యంతో చేపడుతున్న తెలంగాణ జలసిరి కార్యక్రమం కింద జిల్లాకు నిర్దేశించిన అన్ని పనులను అక్టోబర్ నెలాఖరులోగా పూర్తి చేసేలా అధికారులు కార్యాచరణ రూపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో తెలంగాణ జలసిరి కార్యక్రమం పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షలి సమీక్షా సమావేశం నిర్వహించారు.జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామాల వారీగా తెలంగాణ జలసిరి కార్యక్రమం కింద చేపట్టాల్సిన పంట కుంటలు,ఇంకుడు గుంతలు, బోర్‌వెల్ రీచార్జ్ గుంతల నిర్మాణ లక్ష్యాలు, ఇప్పటివరకు సాధించిన పురోగతిని కలెక్టర్ సమీక్షించారు.ఇంకా ప్రారంభం కాని పనులు, నిర్మాణ దశలో ఉన్న పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ విబీజీ రాంజీ పథకాన్ని సద్వినియోగం చేసుకుంటూ గ్రామీణ ప్రాంతాల్లో భూగర్భ జలాలను పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం తెలంగాణ జలసిరి కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు.ప్రతి మండలం, ప్రతి గ్రామ పరిధిలో నిర్దేశించిన లక్ష్యం మేరకు పంట కుంటలు, ఇంకుడు గుంతలు,బోర్‌వెల్ రీచార్జ్ గుంతలు నిర్మించాలని సూచించారు.ప్రస్తుతం తెలంగాణ జలసిరి కార్యక్రమం పురోగతి ఆశించిన స్థాయిలో లేదని పేర్కొన్నారు.పనులను మరింత వేగవంతం చేసి అక్టోబర్ నెలాఖరులోగా జిల్లాకు నిర్దేశించిన పూర్తి లక్ష్యాన్ని సాధించే విధంగా కార్యాచరణ రూపొందించుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలను,రైతులను పెద్ద ఎత్తున భాగస్వామ్యం చేస్తూ ప్రతి గ్రామంలో అవసరమైన ప్రాంతాలను గుర్తించాలని సూచించారు. ప్రతి ఇంటికి ఇంకుడు గుంత, రైతుల పొలాల్లో పంట కుంటలు, బోర్‌వెల్స్ వద్ద రీచార్జ్ గుంతలు ఏర్పాటు చేసేలా ప్రణాళిక రూపొందించాలని తెలిపారు.అవసరమైన పరిపాలనా అనుమతులను వెంటనే జారీ చేసి నిర్మాణ పనులను ప్రారంభించాలని ఆదేశించారు. రైతులను భాగస్వామ్యం చేస్తూ పంట కుంటల తవ్వకం పనులను వేగవంతం చేయాలని, గ్రామాల వారీగా నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేసేలా క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.ప్రతి మండలానికి సంబంధించి నిర్దిష్ట కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకుని పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని తెలిపారు. ప్రారంభం కాని పనులను వెంటనే ప్రారంభించడంతో పాటు వివిధ దశల్లో ఉన్న పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు.భూగర్భ జలాల పెంపు, వర్షపు నీటి సంరక్షణకు తెలంగాణ జలసిరి కార్యక్రమం ఎంతో కీలకమని, గ్రామీణ ప్రాంతాల్లో నీటి లభ్యత పెరిగేలా పనులను నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.ఈ సమావేశంలోజడ్పీ సీఈఓ నరేందర్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కాళిందిని,జిల్లా పంచాయతీ అధికారి శ్రీమల, ఎంపీడీవోలు,మండల పంచాయతీ అధికారులు,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 100 రోజులు పాయే!! 1000 రోజులు వచ్చే!!



### - ఇంకెప్పుడు అమలు చేస్తారు ఇచ్చిన హామీలు

### - విలేకరుల సమావేశంలో బి ఆర్ ఎస్ పార్టీ నేతల ధ్వజం

**సుల్తానాబాద్,సెప్టెంబర్ 01(జనంసాక్షి) :** ఎన్నికలకు ముందు సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలు 100 రోజులలో అమలు చేస్తానని చెప్పి నేటికీ 1000 రోజులు కావస్తున్నా, ఆరు గ్యారంటీ పోను ఇచ్చిన 420 హామీలు ఎప్పుడూ అమలు చేస్తారని బి ఆర్ ఎస్ పార్టీ మండల కన్వీనర్లు బోయిని రాజమల్లయ్య, మైలారం నారాయణ, మున్సిపల్ బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు పారుపల్లి గుణపతి, మో ల్గురి అంజయ్యగౌడ్, సీనియర్ నేత క్యాదాసి చంద్రమౌళి, మాజీ ఎంపీటీసీ,సూర శ్యామ్, తిప్పారపు దయాకర్, సర్పంచులు దీకొండ భూమేష్ కుమార్, ఓజ్జ సంపత్ యాదవ్, ధ్వజమెత్తారు. మంగళవారం స్థానిక వైశ్య భవన్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, సీఎం రేవంత్ రెడ్డి ఆచరణకు అమలు కాని హామీలు ఇచ్చి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.6 గ్యారంటీ ల సంగతి ఏమో కానీ 420 హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం కనీసం 6 గ్యారంటీలను కూడా ఇప్పటివరకు అమలు చేయలేక పోయిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎంతోమంది నిరుపేద ప్రజలు తీవ్ర అవస్థలను ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వ కార్యాలయాలలో కూడా పనులు కాక నానా అవస్థలు పడుతున్నారని విమర్శించారు. మహిళలకు 2500 వందలు ఇంకెప్పుడు ఇస్తారని నిలదీశారు. కల్యాణ లక్ష్మి పథకంలో తులం బంగారం ఇస్తానని ఏ ఒక్క కుటుంబానికైనా ఇప్పటివరకు ఇచ్చారా? అని ప్రశ్నించారు. ఇచ్చిన 6 గ్యారంటీ పథకాలలో గ్యాస్ సబ్సిడీ అమలు కావడంలేదని, రైతు భరోసా ఊ సే లేదని, ఒకపక్క ఆటో డ్రైవర్లు, కౌలు రైతులు ఇచ్చిన హామీ 12 వేల రూపాయలు ఎప్పుడు ఇస్తారని ఆందోళన కార్యక్రమాలకు పూనుకుంటున్నారని తెలిపారు. ఫ్రీ బస్సుతో మహిళలు ఇబ్బందుల పాలవుతున్నారని, ఫ్రీ బస్సు మాకెందుకని మహిళలే ప్రశ్నిస్తున్నారని ఆరోపించారు.ఇకపోతే విడతలవారీగా సంక్షేమ పథకాలు అమలు చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం మంత్రులు ఎమ్మెల్యేలు ప్రగల్బాలు పలకడానికి పరిమితం అవుతున్నారు తప్పా, ప్రజల గురించి పట్టించుకున్న నాథుడే కరువయ్యారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి తో పాటు మంత్రులు ఎమ్మెల్యేలు కేవలం మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావును, మాజీ మంత్రులు కల్వకుంట్ల తారక రామారావును, తన్నీరు హరీష్ రావును, విమర్శించడానికి వారికి సమయం సరిపోతుందని, విమర్శించారు. నాలుగున్నర కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్ష సాధించడం ఒక ఎత్తు అయితే, సాధించిన తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపించిన ఘనత కేసిఆర్కే దక్కిందని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసిన ఘనత బి ఆర్ ఎస్ పార్టీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. రైతు బంధు పథకాన్ని అన్ని వర్గాలకు అమలు చేసి దేశానికే ఆదర్శంగా నిలిచిన ఏకైక వ్యక్తి కేసీఆర్ అని తెలిపారు.సీఎం రేవంత్ రెడ్డి రైతు భరోసా పథకాన్ని నిర్వీర్యం చేసి, ఇప్పటివరకు ఐదు లోపు ఎకరాలు ఉన్న రైతులకే రైతు భరోసా దిక్కు లేదని, రెండు పంటలకు రైతు భరోసా ఇవ్వలేదని ధ్వజమెత్తారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని ఎన్ని ఉద్యోగాలు కాంగ్రెస్ శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి లేదని, విద్యార్థులకు స్కూటీలు ఇస్తానని ఇవ్వలేదని, కనీసం పింఛన్లు కూడా ఇచ్చే పరిస్థితి కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డికి లేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించడాన్ని నిరసిస్తూ, 8 రోజుల కార్యాచరణ ప్రణాళికను బి ఆర్ ఎస్ పార్టీ పార్టీ తీసుకుందని, 8 రోజులపాటు ఒక్కో రోజు ఒక్కో హామీపై ఆందోళన కార్యక్రమాలను చేస్తామని ప్రజాక్షేత్రంలో ప్రజలను చైతన్యం చేస్తామని వారు స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వానికి మంత్రులకు, ఎమ్మెల్యేలకు, ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా, వెంటనే ఇచ్చినటువంటి 420 హామీలన్నిటిని అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. లేనియెడల రానున్న రోజులలో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు గుణపాఠం చెపుతారని హెచ్చరించారు. విలేకర్ల సమావేశంలో,బిఆర్ ఆర్ ఎస్ పార్టీ మండల కన్వీనర్లు బోయిని రాజమల్లయ్య, మైలారం నారాయణ,మాజీ ఎంపీటీసీ సూరశ్యాం, తిప్పారపు దయాకర్, పారుపల్లి గుణపతి, సర్పంచులు దీకొండ భూమేష్ కుమార్, ఒజ్జ సంపత్ యాదవ్,నేతలు మాజీ ఎంపీటీసీ ఫకీర్ యాదవ్, మొ ల్గురి అంజయ్య గౌడ్, ఆరేపల్లి రాకేష్, కాంపల్లి రాజు,వేయికళ్ల నరేందర్, తిప్పారపు లక్ష్మణ్, బండి సంపత్ గౌడ్, గందె మల్లికార్జున్, పొన్నం సంపత్ గౌడ్,పసిడ్ల సంపత్, కన్నూరి ప్రభాకర్, పూరెళ్ల శ్రీనివాస్,కల్వల ఓదెలు, అనుమాల బాబురావు, బండ తిరుపతితో పాటు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేయాలి

### - ఏఐఎఫ్‌బీ పట్టణ కన్వీనర్ కుక్క శ్రావణ్‌కుమార్ డిమాండ్





పెద్దపల్లి,సెప్టెంబర్ 01(జనంసాక్షి) : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలతోపాటు అన్ని హామీలను వెంటనే అమలు చేయాలని ఏఐఎఫ్‌బీ పట్టణ కన్వీనర్ కుక్క శ్రావణ్‌కుమార్ డిమాండ్ చేశారు. పెద్దపల్లి బస్టాండ్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు.హామీలు అమలు చేయలేక పోతే ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని నిరసన వ్యక్తం చేశారు. మహిళలకు రూ.2,500, రూ.500కే గ్యాస్ సిలిండర్, పెన్షన్ల పెంపు, రైతు భరోసా, ఆటో డ్రైవర్లకు ఏటా రూ.12 వేల ఆర్థిక సాయం తదితర హామీలను అమలు చేయాలని అన్నారు.ప్రభుత్వ ఉద్యోగులకు సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయడంతోపాటు పెండింగ్ డీఏలను విడుదల చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో కుక్క అశోక్,నూనె వెంకటేశ్, మహరాజ్, షఫీ,కుక్క చరణ్,ఒడ్డపల్లి తిరుమల్‌తోపాటు ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

## గ్యాస్ ప్రమాదాలు నివారించడానికి తనిఖీ అవసరం..

### - సింగరేణి అధికార ప్రతినిధి రెడ్డిమల్ల తిరుపతి..

**గోదావరిఖని, జనంసాక్షి :** ఆర్‌జీ-1 పరిధిలోని సింగరేణి సూపర్ బజార్ నుంచి తీసుకుంటున్న భారత్ గ్యాస్, ఇండియన్ గ్యాస్ వినియోగదారులకు గ్యాస్ ప్రమాదాలను నివారించడానికి వినియోగదారుల భద్రత కోసం తప్పనిసరి తనిఖీ (మ్యాండేటరీ-ఇన్‌స్పెక్షన్) నిర్వహించడం జరుగుతుంది. ఇందులో భాగంగా గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ సిబ్బంది గ్యాస్ వినియోగదారుల ఇళ్లకు వచ్చి తనిఖీలు చేస్తారని సింగరేణి ఆర్‌జీ-1 అధికార ప్రతినిధి రెడ్డిమల్ల తిరుపతి ఒక ప్రకటనలో తెలిపారు.వినియోగదారులు గమనించాలని ఆయన సూచించారు.గ్యాస్ ట్యూబ్..సురక్ష ట్యూబ్ గడువు ముగిస్తే వెంటనే మార్చుకోవాలని,భద్రతా పరికరాలు అదనపు రక్షణ కోసం సేఫ్టీ ఫైర్ బాల్స్,ఆప్రాన్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు.పేరు మార్పు వినియోగదారుడు మరణించినట్టయితే గ్యాస్ కనెక్షన్ కుటుంబ సభ్యుల పేరు మీదకు తప్పనిసరిగా మార్చుకోవాలని తిరుపతి పేర్కొన్నారు.ఈ-కేవైసీ ప్రతి వినియోగదారుడు తప్పనిసరిగా చేసుకోవాలని, వినియోగదారులు పైవిషయాలలో సహకరించి, సురక్షితంగా ఉండాలని ఆర్‌జీ-1 అధికార ప్రతినిధి రెడ్డిమల్ల తిరుపతి ఒక ప్రకటనలో తెలిపారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని

### - కలెక్టర్,ఎమ్మార్వోలకు బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ,ధర్మ సమాజ్ పార్టీ వినతి



**పెద్దపల్లి,సెప్టెంబర్ 01(జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ధర్మ సమాజ్ పార్టీ డి.ఎస్.పి, సంయుక్తంగా మంగళవారం పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కు సంబంధిత ఎమ్మార్వో,కి వినతిపత్రాలు సమర్పించారు.తెలంగాణ రాష్ట్రంలో సుమారు 30 లక్షల మంది విద్యార్థులకు సంబంధించిన రూ.14,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని, దీని కారణంగా పేద, బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నాయకులు తెలిపారు.కళాశాలల్లో ఫీజులు చెల్లించలేక విద్యార్థుల చదువులు మధ్యలోనే ఆగిపోయే పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని, ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీతో ఒక జీవో జారీ చేయాలని వారు డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ధర్మ సమాజ్ పార్టీ తరఫున పెద్దపల్లి జిల్లా కలెక్టర్ గారికి వినతిపత్రం సమర్పించగా,బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ తరఫున ఎమ్మార్వో కి వినతిపత్రం అందజేశారు. విద్యార్థుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, బకాయిల విడుదలకు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మాతంగి రేవంత్ మహారాజ్,బి సి ఎస్ సి ఎస్ టి జేఏసీ పెద్దపల్లి జిల్లా కో-కోఆర్డినేటర్ గరిగంటి కుమార్ ముదిరాజ్ పాటు కుమార్ పటేల్,అంజి గౌడ్, భాస్కర్ యాదవ్,కాదశి రమేష్,ఎదుళ్ల శంకరయ్య,కుక్క అవినాష్ ,రామ్ మూర్తి, ఏ.గోపి,ఎలమంద,తాళ్ల లక్ష్మణ్,కుమార్,తదితరులు పాల్గొన్నారు.

## పల్లవి స్కూల్ లో జరిగే క్రీడ మైదానాన్ని పరిశీలించిన విద్యాధికారులు



**పెద్దపల్లి,సెప్టెంబర్ 01 (జనంసాక్షి) :** పల్లవి స్కూల్ లో జరగబోయే (ఎస్ జి ఎఫ్) మండల స్థాయి టోర్నమెంట్ కం సెలక్షన్స్ పెద్దపల్లి విద్యాధికారి టి సురేంద్ర కుమార్ మరియు పీటి సంఘ జిల్లా అధ్యక్షులు డాక్టర్ వేల్పుల సురేందర్ పల్లవి స్కూల్ కరెస్పాండెంట్ శోభారాణి క్రీడ మైదానాన్ని పరిశీలించారు. రేపు ఆడబోయే క్రీడా పోటీలకు అనుకూలంగా ఉందా లేదా సరైన వసతులు ఉన్నాయా అని పరిశీలించడం జరిగింది. ఈ కార్యక్రమానికి పెద్దపల్లి విద్యాధికారి జి.శారద మరియు పెద్దపల్లి డిప్యూటీ ఎస్ఓ ఎ.సురేష్ టి సురేంద్ర కుమార్ ఎంఈఓ ,సిఐ ప్రవీణ్ కుమార్ ఎస్సై నరేష్ కె లక్ష్మణ్ ఎస్ జి ఎఫ్ సెక్రటరీ,దాసరి రమేష్ పెటార్ టీఎస్ కార్యదర్శి హాజరుకానున్నారని ఎస్ జి ఎఫ్ మండల కన్వీనర్ సి ఎచ్ శైలజ, పి ఇ టి సంఘ జిల్లా అధ్యక్షులు డాక్టర్ వేల్ప సురేందర్ తెలిపారు.

## ఎన్టీపీసీ రామగుండంలో 'విజిలెన్స్' అవగాహన సదస్సు..



గోదావరిఖని, జనంసాక్షి : ఎన్టీపీసీ రామగుండం చేపట్టిన మూడు నెలల సుదీర్ఘ 'విజిలెన్స్ అవగాహన కార్యక్రమం'లో భాగంగా, విజిలెన్స్ విభాగం,సీఎస్ఆర్ విభాగం సంయుక్తంగా అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించాయి.ఉద్యోగుల అభివృద్ధి కేంద్రం (ఈడీసీ)లో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.ఏజీఎం (విజిలెన్స్)రాజిత్ కుమార్ గుండా ఈ కార్యక్రమానికి నాయకత్వం వహించారు. మోసాల నివారణ, దైనందిన జీవితంలో అప్రమత్తత (విజిలెన్స్) ప్రాముఖ్యత, సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ (సీవీసీ) పోర్టల్ ద్వారా ఫిర్యాదులు చేసే విధానంపై ఆయన పాల్గొన్న వారికి అవగాహన కల్పించారు.బాధ్యతాయుతమైన,అవినీతి రహిత సమాజ నిర్మాణంలో పారదర్శకత,నిజాయితీ,నైతిక ప్రవర్తన ప్రాముఖ్యతను ఆయన నొక్కి చెప్పారు.నైతిక విలువలు,బాధ్యతాయుతమైన పౌరసత్వాన్ని పాటించాలనే నిబద్ధతను బలపరుస్తూ పాల్గొన్న వారందరితో 'నిజాయితీ ప్రతిజ్ఞ' (ఇంటిగ్రిటీ ప్లెడ్జ్) కూడా చేయించారు.ఈ కార్యక్రమంలో సుమారు 120 మంది విద్యార్థులు, 10 మంది ఉపాధ్యాయులు, 20 మంది తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు. డీజీఎం (హెచ్ఆర్) ప్రవీణ్ కె.చౌదరి, డీజీఎం (హెచ్ఆర్) రమ్య జయరాజ్, సీఎస్ఆర్ విభాగం సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.విజిలెన్స్,సీఎస్ఆర్ విభాగాల సమన్వయ కృషితో రామగుండం సమాజంలో నిజాయితీ, నైతిక విలువలు, పారదర్శకత, బాధ్యతాయుతమైన పౌరసత్వంపై అవగాహన కల్పించే కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తోంది.

## టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో
# "పెన్షన్ విద్రోహ దినం" నినాదాలతో మార్మోగిన కలెక్టరేట్

**- తెలంగాణ రాష్ట్ర సాధనలో ఉద్యోగులు కీలక పాత్ర పోషించారు**

**- టీజీఅ జేఏసీ చైర్మన్ బొంకూరి శంకర్**

పెద్దపల్లి,సెప్టెంబర్ 01(జనంసాక్షి) : తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కార్మికుల హక్కుల సాధన కోసం తెలంగాణ గవర్నమెంట్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీజీ ఐజేఏసి) పిలుపు మేరకు మంగళవారం పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్ వద్ద నిర్వహించిన "పెన్షన్ విద్రోహ దినం-చలో కలెక్టరేట్" కార్యక్రమం నిర్వహించారు.ఐడీఓసీ ఆవరణలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద జిల్లాలోని వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల, కార్మిక సంఘాల నాయకులు, ఉద్యోగులు నల్ల దుస్తులు,నల్ల బ్యాడ్జీలు ధరించి పెద్ద ఎత్తున సమావేశమై ప్రభుత్వానికి నిరసన స్వరం వినిపించారు.టీజీ ఇ జెఏసి జిల్లా చైర్మన్ బొంకూరి శంకర్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధనలో ఉద్యోగులు కీలక పాత్ర పోషించారని,అదే ఉద్యోగుల న్యాయమైన హక్కులు నేడు నిర్లక్ష్యానికి గురవడం బాధాకరమని అన్నారు. సీపీఎస్ ఉద్యోగుల భవిష్యత్తును అనిశ్చితిలోకి నెట్టిందని,వెంటనే ఓపీఎస్ పునరుద్ధరణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఐదు సంవత్సరాలు పాలించిన రాజకీయ నాయకులకు పెన్షన్ ఉంటది కానీ 30 నుంచి 30 సంవత్సరాల సర్వీ చేసిన ఉద్యోగులకు మాత్రం పెన్షన్ లేకపోవడం చాలా బాధాకరం.ఇది కేవలం పెన్షన్ సమస్య కాదని, ఉద్యోగుల గౌరవం, భద్రతకు సంబంధించిన ఉద్యమమని పేర్కొంటూ,ప్రభుత్వం స్పందించకపోతే సెప్టెంబర్ 10న జరిగే చలో హైదరాబాద్ మహాధర్నాను చరిత్రాత్మక విజయంగా నిలబెడతామని హెచ్చరించారు.జిల్లా కన్వీనర్ తూము రవీందర్ మాట్లాడుతూ, జిల్లాలోని 206 ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల,కార్మిక సంఘాలు ఐక్యంగా ఈ ఉద్యమంలో పాల్గొనడం ఉద్యమ బలాన్ని చాటిందన్నారు.జిల్లా కార్యదర్శి గందు సురేష్ మాట్లాడుతూ,ఉద్యోగుల ఐక్యతే ఉద్యమానికి ప్రధాన బలమని అన్నారు. సీపీఎస్ రద్దు, డీఏల విడుదల, పీఆర్సీ అమలు వంటి అంశాల్లో ప్రభుత్వం వెంటనే సానుకూల నిర్ణయాలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతి ఉద్యోగి ఉద్యమంలో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు.జిల్లా కార్యదర్శి అయిరెడ్డి సందీప్ రెడ్డి మాట్లాడుతూ,ఉద్యోగుల న్యాయమైన హక్కుల కోసం ప్రారంభమైన ఈ ఉద్యమం మరింత ఉధృతమవుతుందని అన్నారు. పెద్దపల్లి జిల్లాలో ప్రతి మండలం,ప్రతి కార్యాలయం నుంచి ఉద్యోగులు స్వచ్ఛందంగా వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయడం అభినందనీయమన్నారు. నల్ల దుస్తులతో జరిగిన ఈ నిరసన ఉద్యోగుల ఆవేదనకు ప్రతీకగా నిలిచిందని పేర్కొన్నారు. సెప్టెంబర్ 10న జరిగే చలో హైదరాబాద్ మహాధర్నాలో పెద్దపల్లి జిల్లా నుంచి భారీ సంఖ్యలో ఉద్యోగులు పాల్గొని ఉద్యమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో టీఎన్జీఓ రాష్ట్ర నాయకులు సందీప్ రావు, టీఎన్జీఓ అసోసియేట్ అధ్యక్షులు గోపు అనిత, కోశాధికారి కొమురయ్య, కార్యదర్శి అయిరెడ్డి సందీప్ రెడ్డి,టీజీఓ కార్యదర్శి గందు సురేష్, జిల్లా సంఘ బాధ్యులు శ్రీనివాస్, మహేందర్ రెడ్డి, స్వప్న కుమారి,ప్రవీణ్, శ్రీధర్, రమేష్, రాజారత్నం, సౌమ్య,అంజయ్య,నిశాంత్‌రావు,శిల్ప,స్వప్న,శివ,శ్రీనివా -స్,టీజీఓ జిల్లా కార్యదర్శి గందు సురేష్,కార్యవర్గ సభ్యులు రవీంద్రనాథ్,గోడిశాల శ్రీనివాస్, సాజిద్అలీ,జిల్లా అధికారుల సంఘం అధ్యక్షుడు ప్రవీణ్ రెడ్డి,సభ్యులు కంపెల్లి రమేష్,సురేష్,యు టి ఎఫ్అధ్యక్షులు లక్ష్మణ్,ఇంజనీరింగ్ అసోసియేషన్ సభ్యులు రవీంద్రచారి, నరేష్, సమర్ సేన్, మధుబాబు,టీఎన్‌జీఓస్ గ్రామీణ సంఘం,కార్యదర్శి ప్రేమ్ సాగర్,సుల్తానాబాద్ యూనిట్ అధ్యక్షురాలు భాగ్యమ్మ, కార్యదర్శి రాజిరెడ్డి మరియు వారి సంఘ సభ్యులు,రామగుండం యూనిట్ అధ్యక్షుడు జగన్, కార్యదర్శి సరిత, మరియు వారి సంఘ సభ్యులు, పీఏఓ ఫోరం ప్రతినిధులు మహేందర్ రెడ్డి, రామ్ కుమార్,ట్రెజరీ ఫోరం ప్రతినిధులు సంతోష్, శ్రీనివాస్,ప్రేమ్ సాగర్,స్వప్న కుమారి,మనెమ్మ, రవి,దివ్య,శ్యాం కుమార్,మెడికల్ ఫోరం ప్రతినిధులు వీరగోని శ్రీనివాస్, ప్రవీణ్,లక్ష్మణ్,రాజేశం,మధు, శ్రీనివాసులు,వెటరినరీ ప్రతినిధులు అధ్యక్షుడు రాజేందర్, కార్యదర్శి సాదిక్ లు పాల్గొన్నారు.చివరగా నాయకులు మాట్లాడుతూ,"ఇది ప్రారంభం మాత్రమే..ఉద్యోగుల న్యాయమైన హక్కులు సాధించే వరకు ఉద్యమం ఆగదు" అని స్పష్టం చేశారు.సెప్టెంబర్ 10న హైదరాబాద్‌లో జరిగే మహాధర్నాను భారీ విజయవంతం చేయాలని జిల్లా ఉద్యోగులకు పిలుపునిచ్చారు.





## కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేయాలి

**- ఏఐఎఫ్‌బీ పట్టణ కన్వీనర్ కుక్క శ్రావణ్‌కుమార్ డిమాండ్**

పెద్దపల్లి,సెప్టెంబర్ 01(జనంసాక్షి) : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలతోపాటు అన్ని హామీలను వెంటనే అమలు చేయాలని ఏఐఎఫ్‌బీ పట్టణ కన్వీనర్ కుక్క శ్రావణ్‌కుమార్ డిమాండ్ చేశారు. పెద్దపల్లి బస్టాండ్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు.హామీలు అమలు చేయలేకపోతే ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని నిరసన వ్యక్తం చేశారు.మహిళలకు రూ.2,500, రూ.500కే గ్యాస్ సిలిండర్, పెన్షన్ల పెంపు, రైతు భరోసా, ఆటో డ్రైవర్లకు ఏటా రూ.12 వేల ఆర్థిక సాయం తదితర హామీలను అమలు చేయాలని అన్నారు.ప్రభుత్వ ఉద్యోగులకు సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయడంతోపాటు పెండింగ్ డీఏలను విడుదల చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో కుక్క అశోక్,నూనె వెంకటేష్,మహారాజ్,షఫీ,కుక్క చరణ్,ఒడ్డపల్లి తిరుమల్‌తోపాటు ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

## పల్లవి స్కూల్ లో జరిగే క్రీడ మైదానాన్ని పరిశీలించిన విద్యాధికారులు

పెద్దపల్లి,సెప్టెంబర్ 01(జనంసాక్షి) : పల్లవి స్కూల్ లో జరగబోయే (ఎస్ జి ఎఫ్) మండల స్థాయి టోర్నమెంట్ కం సెలక్షన్స్ పెద్దపల్లి విద్యాధికారి టి సురేంద్ర కుమార్ మరియు పీటీ సంఘ జిల్లా అధ్యక్షులు డాక్టర్ వేల్పుల సురేందర్ పల్లవి స్కూల్ కరస్పాండెంట్ శోభారాణి క్రీడ మైదానాన్ని పరిశీలించారు. రేపు ఆడబోయే క్రీడా పోటీలకు అనుకూలంగా ఉందా లేదా సరైన వసతులు ఉన్నాయా అని పరిశీలించడం జరిగింది. ఈ కార్యక్రమానికి పెద్దపల్లి విద్యాధికారి జి.శారద మరియు పెద్దపల్లి డిప్యూటీ ఎస్ఓ ఎ.సురేష్, టి సురేంద్ర కుమార్ ఎంఈఓ ,సిఐ ప్రవీణ్ కుమార్ ఎస్సై నరేష్ కె లక్ష్మణ్ ఎస్ జి ఎఫ్ సెక్రటరీ,దాసరి రమేష్ పెటార్ టీఏస్ కార్యదర్శి హాజరుకానున్నారని ఎస్ జి ఎఫ్ మండల కన్వీనర్ సి ఎచ్ శైలజ, పి ఇ టి సంఘ జిల్లా అధ్యక్షులు డాక్టర్ వేల్పు సురేందర్ తెలిపారు.



### ఆగస్టు అంతానికి..
## సింగరేణి ఆర్జీ-1లో 124శాతం బొగ్గు ఉత్పత్తి..

- **అంపశయ్యపై 400 మంది కార్మికులు..**
- **జీడీకే.11వ గనిలో మూడవ సీఎంను ఆరు నెలల్లో ప్రవేశపెడుతాం..**
- **95శాతం పూర్తయిన ఎస్‌టీపీ పనులు..**
- **విలేకరుల సమావేశంలో జనరల్ మేనేజర్ డి.లలిత్‌కుమార్..**

గోదావరిఖని, జనంసాక్షి : ఆగస్టు అంతానికి సింగరేణి ఆర్జీ-1 ఏరియాలో 124శాతం బొగ్గు ఉత్పత్తి తీశామని జనరల్ మేనేజర్ డి.లలిత్‌కుమార్ తెలిపారు.గోదావరిఖని జీఎం కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో బొగ్గు ఉత్పత్తి..ఉత్పాదకత..తదితర వివరాలను వెల్లడించారు.సింగరేణి ఆర్జీ-1 ఏరియాలో 400 మంది కార్మికులు అంపశయ్యపై ఉన్నారన్నారు.వారు విధుల్లో నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు.విధులకు సక్రమంగా రావడంలేదని పేర్కొన్నారు.విధుల్లో ఉంటేనే ఉద్యోగం ఉంటుందన్న విషయాన్ని గ్రహించాలన్నారు.అదే విధంగా జీడీకే.11వ గనిలో 3వ కంటిన్యూస్ మైనర్ (సీఎం)ను ఆరునెలల్లో గనిలో ప్రవేశపెడుతామని, దానికి సంబంధించిన పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు.ఇకపోతే ఎస్‌టీపీలు దాదాపుగా 95శాతానికి పైగా పూర్తయ్యాయని, మరో నెల రోజుల్లో అందుబాటులోకి రానున్నాయన్నారు.కొన్ని సాంకేతిక పనుల దృష్ట్యా ఆలస్యం జరుగుతుందని, త్వరలోనే సింగరేణీయులకు మంచినీరు అందిస్తామన్నారు.




# విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ కనబరచాలి

**- ఎస్ జి ఎఫ్ మండల స్థాయి క్రీడా పోటీలను ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ**

సుల్తానాబాద్,సెప్టెంబర్ 01(జనంసాక్షి) : విద్యార్థినీ విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ చూపించి విజయం వైపు అడుగులు వేయాలని మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ అన్నారు.మంగళవారం ఎస్ జి ఎఫ్ మండల స్థాయి క్రీడా పోటీలు స్థానిక ఇండియన్ పబ్లిక్ పాఠశాలలో ప్రారంభం కాగా ముఖ్యఅతిథిగా హాజరైన మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ క్రీడా పోటీలను ప్రారంభించారు.ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో బిరుదు రాధాకృష్ణ మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించినప్పుడే అనుకున్న లక్ష్యాలను అధిగమిస్తారన్నారు. మండలంలోని అన్ని పాఠశాలల విద్యార్థిని విద్యార్థులు క్రీడల్లో పాల్గొనడానికి ఆసక్తి చూపారు. మంగళవారం బాలికల జట్లకు పోటీలు నిర్వహించారు.కబడ్డీ, కోకో,వాలీబాల్, తదితర క్రీడా పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో క్రీడల జిల్లా అధికారి సురేష్ కుమార్, ఇండియన్ పబ్లిక్ పాఠశాల డైరెక్టర్ ప్రిన్సిపాల్ మాటేటి కృష్ణప్రియ సంజీవ్, మున్సిపల్ వైస్ చైర్మన్ అంతటి పుష్పలత, తిరుపతి, రవీందర్‌తో పాటు పిఈటిలు దాసరి రమేష్,తాండ్ర ప్రణయ్,బొ ల్లి సత్యనారాయణ,గెల్లు మధుకర్‌తో పాటు విద్యార్థులు,విద్యార్థులు పాల్గొన్నారు.



## కేరళ మోడల్ హైస్కూల్‌లో సోషల్ మీడియా అవగాహన ర్యాలీ

సుల్తానాబాద్,సెప్టెంబర్ 01(జనంసాక్షి): కరళ మోడల్ హైస్కూల్ ఒకటవ తరగతి నుండి ఐదవ తరగతి విద్యార్థులు సోషల్ మీడియాను సాధ్యమైనంత వరకు దూరంగా ఉంచుకుని, చదువు, వ్యక్తిత్వ వికాసంపై దృష్టి సారించాలని సందేశమిస్తూ ప్రత్యేక అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు సోషల్ మీడియా వినియోగాన్ని పరిమితం చేసి, విలువైన సమయాన్ని చదువు,క్రీడలు ఇతర సృజనాత్మక కార్యక్రమాలకు వినియోగించాలని నినాదాలు చేశారు.ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ సిజు ఎస్. నాయర్, వైస్ ప్రిన్సిపల్ స్మితా ఎస్. నాయర్, ఉపాధ్యాయులు 200 మంది విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఉపాధ్యాయుల బృందం విద్యార్థులకు సోషల్ మీడియా వల్ల కలిగే ప్రయోజనాలు,అనవసర వినియోగం వల్ల ఎదురయ్యే సమస్యలపై అవగాహన కల్పించారు.ఈ ర్యాలీ ద్వారా సమాజానికి ఒక మంచి సందేశాన్ని అందించిన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం అభినందించారు.

# కవిత వ్యాఖ్యలు 'దొంగే దొంగ అన్నట్లు' ఉన్నాయి

## కవిత వ్యాఖ్యలు హాస్యాస్పదం.. అభివృద్ధిపై మాట్లాడే నైతిక హక్కు టీఆర్ఎస్‌కు లేదు

## బీజేపీ రాష్ట్ర కార్యదర్శి గోపిడి స్రవంతి రెడ్డి



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 01 జనంసాక్షి :**
నిజామాబాద్‌లోని భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి గోపిడి స్రవంతి రెడ్డి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ దంపల్లి జ్యోతిలు నిన్న కల్వకుంట్ల కవిత చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా గోపిడి స్రవంతి రెడ్డి మాట్లాడుతూ.. నిన్న కల్వకుంట్ల కవిత మాట్లాడిన మాటలు వింటుంటే 'దొంగే దొంగ అన్నట్లు.. ఊరంతా దోచుకున్న వ్యక్తి ఊరి పెద్దకు నీతులు చెప్పినట్లు' ఉందని ఎద్దేవా చేశారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న పదేళ్ల కాలంలో మాధవ్‌నగర్ ఆర్వోబీ పనులు ఎందుకు ప్రారంభం కాలేదని ప్రశ్నించారు. కేంద్రం నుంచి ఎంపీ ధర్మపురి అర్వింద్ నిధులు మంజూరు చేయించినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధులు కేటాయించకుండా ఏళ్ల తరబడి జాప్యం చేసి ప్రజలను ఇబ్బందులకు గురిచేసిందని ఆరోపించారు. "పదేళ్లు రాష్ట్రాన్ని జలగల్లా పీల్చి పిప్పి చేసిన చరిత్ర బీఆర్ఎస్‌ది కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి గల్లీ స్థాయి కాంట్రాక్టుల వరకు కమిషన్ల ఆరోపణలు ఎదుర్కొన్న మీకు అభివృద్ధి గురించి మాట్లాడే నైతిక హక్కు ఎక్కడుంది?" అని ప్రశ్నించారు. ఎంపీ అర్వింద్ చేసిన అభివృద్ధి ప్రజల కళ్ల ముందే ఉంది "ఏడేళ్లలో ఎంపీ అర్వింద్ ఒక్క రూపాయి తీసుకురాలేదని కవిత మాట్లాడటం పచ్చి అబద్ధం" అని స్రవంతి రెడ్డి మండిపడ్డారు. అమృత్ భారత్ పథకం కింద నిజామాబాద్ రైల్వే స్టేషన్ ఆధునీకరణ, మాధవ్‌నగర్, మామిడిపల్లి, అడవి మామిడిపల్లి, అర్సపల్లి, జానకంపేట్, ఇందల్వాయి ప్రాంతాల్లో ఆర్వోబీలు, ఆర్‌యూబీలు, జిల్లా విద్యార్థుల భవిష్యత్తు కోసం రెండు కేంద్రీయ విద్యాలయాలు, రెండు నవోదయ విద్యాలయాలతో పాటు కేంద్రం నుంచి వచ్చిన అనేక అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల కళ్ల ముందే ఉన్నాయని తెలిపారు. "ఇన్ని అభివృద్ధి పనులు కనిపిస్తున్నా కవితకు ఎందుకు కనిపించడం లేదు?" అని ప్రశ్నించారు. పసుపు బోర్డు రైతుల కల.. రాజకీయ విమర్శలకు బొమ్మ కాదు పసుపు బోర్డు అనేది మెడలో వేసుకునే బోర్డు కాదని, అది నిజామాబాద్ పసుపు రైతులు తరతరాలుగా కన్న కల అని స్రవంతి రెడ్డి అన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు ఏం చేసిందో ప్రజలకు తెలుసని, ఇప్పుడు పసుపు బోర్డు గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. "లిక్కర్ బాటిళ్ల రేట్లు పెంచడం తెలిసిన వారికి రైతుల చెమట విలువ, పంటకు మద్దతు ధర విలువ ఎలా తెలుస్తుంది?" అని ఘాటుగా విమర్శించారు. అధికారం కోల్పోయిన తర్వాత ఫ్రస్ట్రేషన్‌తో కవిత దిగజారి మాట్లాడుతున్నారని విమర్శించారు. కొత్త రాజకీయ వేదికలు ఏర్పాటు చేసుకున్నంత మాత్రాన గతంలో ఎదుర్కొన్న ఆరోపణల నుంచి తప్పించుకోలేరని అన్నారు. ఇందూరు ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని, ప్రజల తీర్పు ఇప్పటికే స్పష్టమైందని పేర్కొన్నారు.

**కవితకు ప్రజలే సమాధానం చెబుతారు: దంపల్లి జ్యోతి**
ఈ సందర్భంగా డిప్యూటీ ఫ్లోర్ లీడర్ దంపల్లి జ్యోతి మాట్లాడుతూ.. రాజకీయ లబ్ధి కోసమే కవిత 'పాంచజన్యం' పేరుతో సభ నిర్వహించి రాజకీయ నాటకాలు ఆడారని విమర్శించారు. "ఇందూరు కోడలినని చెప్పుకునే కవిత.. ప్రజలతో నిజమైన అనుబంధం ఉంటే మాటల్లో కాదు, చేతల్లో చూపించాలి" అని అన్నారు. కవిత కార్చే మొసలి కన్నీళ్లను ఇందూరు ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని పేర్కొన్నారు. "ఇందూరు గడ్డ బీజేపీకి కంచుకోట. ఎంపీ ధర్మపురి అర్వింద్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం మానుకోవాలి. మా ఎంపీపై మరోసారి అసత్య ఆరోపణలు చేస్తే ప్రజలే తగిన సమాధానం చెబుతారు" అని దంపల్లి జ్యోతి హెచ్చరించారు. ఈ మీడియా సమావేశంలో కార్పొరేటర్లు చింత ప్రసన్న రెడ్డి, ఇప్పకాయల సుమిత్ర దేవి, పులగం వైష్ణవి, కల్పే అర్చన, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు వనిత, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ 420 హామీల మోసాలపై బీఆర్ఎస్ పోరుబాట

## సెప్టెంబర్ 2 నుంచి 8 వరకు రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు.. నిజాంసాగర్‌లో కార్యకర్తల సమావేశం

**జనం సాక్షి నిజాంసాగర్:**
కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తవుతున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకురాలు, మాజీ ఎంపీపీ పట్లోళ్ల జ్యోతి దుర్గారెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 2 నుంచి 8వ తేదీ వరకు ఏడు రోజులపాటు తెలంగాణ వ్యాప్తంగా వివిధ నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మంగళవారం నిజాంసాగర్ మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడు రోజులపాటు చేపట్టనున్న కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు.
జ్యోతి దుర్గారెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు అనేక హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. రైతులు, మహిళలు, నిరుద్యోగులు, విద్యార్థులు, పేదలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు బీఆర్ఎస్ పోరాట కార్యక్రమాలను చేపడుతోందన్నారు.
సెప్టెంబర్ 2న జుక్కల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ ఇచ్చిన 400 హామీలపై ధర్నా, బాకీ కార్డుల పంపిణీ కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. 3న పిట్లం మండల కేంద్రంలో నియోజకవర్గస్థాయి రైతు సదస్సు నిర్వహించి యూరియా కొరత, రైతు బీమా, సాగునీటి సమస్యలపై చర్చించనున్నట్లు చెప్పారు.
బీఆర్ఎస్ చేపట్టనున్న ఈ నిరసన కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అచ్చంపేట సొసైటీ చైర్మన్ నరసింహారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ మనోహర్, మాజీ సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రమేష్‌గౌడ్, నాయకులు కమ్మరి కథ అంజయ్య, బేగరి రాజు, శీను కురుమ, శ్రీను, దశరథ్, విఠ్ఠల్‌గౌడ్, బొబ్బర్ నాయక్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచాలి

## నిజాంసాగర్ మండలంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్. మల్లికార్జున్ విస్తృత పర్యటన

## విద్యార్థుల చదువు, రాత, గణిత సామర్థ్యాల పరిశీలన.. వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ముందుకు సాగాలని సూచన

నిజాంసాగర్, సెప్టెంబర్ 1(**జనంసాక్షి**)::
విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు పాఠశాలల్లో మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్. మల్లికార్జున్ తెలిపారు. మంగళవారం నిజాంసాగర్ మండలంలో ఆయన విస్తృతంగా పర్యటించి పలు పాఠశాలలను, అభివృద్ధి పనులను పరిశీలించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలు, ఉపాధ్యాయుల బోధనా విధానం, మధ్యాహ్న భోజన నాణ్యత, పాఠశాలల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆయన సమీక్షించారు.

**సమీకృత వంటశాల పనుల పరిశీలన**
ముందుగా నిజాంసాగర్‌లో నిర్మాణంలో ఉన్న సమీకృత వంటశాల పనులను జిల్లా విద్యాశాఖ అధికారి పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని సంబంధిత సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పనులను త్వరితగతిన పూర్తి చేసి విద్యార్థులకు సాధ్యమైనంత త్వరగా ఉదయం అల్పాహారం అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు.

**విద్యార్థుల సామర్థ్యాలపై ప్రత్యక్ష పరిశీలన**
అనంతరం అచ్చంపేట ఎంపీపీఎస్ పాఠశాలను సందర్శించిన డీఈఓ ప్రతి తరగతి గదికి వెళ్లి విద్యార్థుల విద్యా సామర్థ్యాలను స్వయంగా పరిశీలించారు. విద్యార్థులతో చదివించడం, రాయించడం, గణితంలో లెక్కలు చేయించడం ద్వారా వారి అభ్యసన స్థాయిని తెలుసుకున్నారు. విద్యార్థులు ఏ అంశాల్లో వెనుకబడి ఉన్నారో గుర్తించి, వారికి అవసరమైన అదనపు బోధన అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు.
పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి. లాల్ సింగ్ బోధనా విధానాన్ని కూడా పరిశీలించిన ఆయన, విద్యార్థుల స్థాయికి అనుగుణంగా సులభమైన పద్ధతుల్లో బోధన అందించాలని సూచించారు.

**మధ్యాహ్న భోజనంలో నాణ్యతకు ప్రాధాన్యం**
పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని కూడా పరిశీలించిన డీఈఓ భోజన నిర్వాహకులతో మాట్లాడారు. విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యమైన, పౌష్టికాహారం అందించాలని సూచించారు. ఆహార పదార్థాల నాణ్యత విషయంలో రాజీ పడకూడదని స్పష్టం చేశారు.

**జెడ్పీహెచ్ఎస్‌లో విద్యా ప్రమాణాల పరిశీలన**
అచ్చంపేట జెడ్పీహెచ్ఎస్‌ను సందర్శించిన ఎల్. మల్లికార్జున్ 6వ తరగతి విద్యార్థుల విద్యా ప్రమాణాలను పరిశీలించారు. తెలుగు, ఆంగ్లం, గణితంలో విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. విద్యార్థుల అభ్యసన స్థాయిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అవసరమైన విద్యా సహాయాన్ని అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

**పదో తరగతి విద్యార్థులకు దిశానిర్దేశం**
పదో తరగతి విద్యార్థులతో డీఈఓ నేరుగా ముచ్చటించారు. ప్రతిరోజూ క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరై, ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను శ్రద్ధగా విని, ఇంటి వద్ద కూడా పునశ్చరణ చేయాలని సూచించారు. పదో తరగతి ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా ప్రతి విద్యార్థి కష్టపడి చదవాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల భవిష్యత్తుకు పదో తరగతి ఫలితాలు కీలకమని, ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని సూచించారు. ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలి .ప్రతి విద్యార్థి అభ్యసన సామర్థ్యాన్ని గుర్తించి, విద్యలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని డీఈఓ సూచించారు. పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెంచడంతో పాటు నాణ్యమైన బోధన అందించేలా ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి పాఠశాలలు కేంద్రాలుగా మారాలని ఆకాంక్షించారు. ఈ పర్యటనలో మండల విద్యాశాఖ అధికారి వై. తిరుపతిరెడ్డి, అచ్చంపేట జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు వెంకట్రామరెడ్డి, ఎంపీపీఎస్ అచ్చంపేట ప్రధానోపాధ్యాయులు డి. లాల్ సింగ్, సీనియర్ ఉపాధ్యాయులు జోసెఫ్, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.







## గణేష్ నవరాత్రులు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కమ్మర్పల్లి ఎస్ఐ.సిహెచ్ సతీష్

**కమ్మర్పల్లి సెప్టెంబర్ 01 (జనంసాక్షి)**

గణేష్ నవరాత్రులు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కమ్మర్పల్లి ఎస్సై సిహెచ్.సతీష్ పేర్కొన్నారు.మంగళవారం రోజున మండలంలోని కోనసముందర్ గ్రామంలో పోలీస్ శాఖ ఉన్నత అధికారులు ఆదేశాల మేరకు ఎస్సై.సతీష్ ఆధ్వర్యంలో గణేష్ నవరాత్రులకు సంబంధించి ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సమావేశంలో ఎస్సై మాట్లాడుతూ మండపాల ఏర్పాటు, మైక్ సెట్ల వినియోగానికి పోలీస్ శాఖ మరియు సంబంధిత అధికారుల నుండి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి, మండపాల వద్ద విద్యుత్ ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రాత్రి వేళలో మండపాల వద్ద నిర్వాహకులు అందుబాటులో ఉండాలని సూచించారు.పరిమితికి లోబడే మైక్ సెట్ వాడలి, డీజె లకు అనుమతి లేదు సుప్రీంకోర్టు నిబంధనల ప్రకారం నిర్దేశిత పరిమితులకు లోబడి మాత్రమే సౌండ్ సిస్టం ఉపయోగించాలి. మద్యం సేవించి మండపాల వద్ద గొడవలు సృష్టిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిమజ్జనం ఊరేగింపులను ప్రశాంత వాతావరణంలో ముగించుకోవాలని కోరారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ శాఖ కు పూర్తి సహకారం ఇస్తామని ఉత్సవాలు సామరస్య పూర్వకంగా జరుపుకుంటామని గ్రామస్తులు, పెద్దలు యువకులు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాకేష్, విడిసి చైర్మన్ గంగాధర్,ఉప సర్పంచ్ శంకర్,శ్రీనివాస్, గ్రామ పెద్దలు యువకులు యువజన సంఘల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కటాఫ్ డేట్ ఎత్తివేయాలి.. ప్రతి బీడీ కార్మికురాలికి పెన్షన్ ఇవ్వాలి

### సెప్టెంబర్ 5న ధర్పల్లిలో ధర్నా: తెలంగాణ ప్రజల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. రమేష్

**సిరికొండ , సెప్టెంబర్ 1:(జనం సాక్షి )**

అర్హత కలిగిన ప్రతి బీడీ కార్మికురాలికి ఎలాంటి ఆంక్షలు, కటాఫ్ డేట్ లేకుండా "చేయూత పెన్షన్" అందించాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 5న ధర్పల్లి మండల కేంద్రంలో ధర్నా నిర్వహించనున్నట్లు తెలంగాణ ప్రజల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. రమేష్ తెలిపారు. ఈ ధర్నాలో బీడీ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.మంగళవారం ధర్పల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆర్. రమేష్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం బీడీ కార్మికులకు కటాఫ్ డేట్ విధించడంతో అనేక మంది కార్మికులు పెన్షన్‌కు దూరమయ్యారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఎన్నికల సమయంలో కటాఫ్ డేట్‌ను ఎత్తివేసి, ప్రతి బీడీ కార్మికురాలికి చేయూత ద్వారా రూ.400 పెన్షన్ అందజేస్తామని హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. అయితే అధికారంలోకి వచ్చిన అనంతరం బీడీ కార్మికులకు ఇచ్చిన హామీని అమలు చేయకుండా మొండి చేయి చూపుతోందని విమర్శించారు. బీడీ పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్న కార్మికుల ఆర్థిక పరిస్థితిని ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని ఆయన కోరారు. కటాఫ్ డేట్‌తో పాటు ఇతర ఆంక్షలను తొలగించి అర్హత కలిగిన ప్రతి బీడీ కార్మికురాలికి చేయూత పెన్షన్ అందించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యపై ప్రభుత్వం వెంటనే స్పందించి బీడీ కార్మికులకు న్యాయం చేయాలని కోరారు.



ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు కే. రాజేశ్వర్, జిల్లా నాయకులు ఎస్. కిషోర్, తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ ధర్పల్లి మండల కమిటీ అధ్యక్షులు ఆశన్న, సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ డివిజన్ నాయకులు ఆర్. దామోదర్ తదితరులు పాల్గొన్నారు.





## థర్మల్ విద్యుత్ కేంద్రాలకు తగినంత బొగ్గు సరఫరా సజావుగా జరగాలి..

**- థర్మల్ విద్యుత్ కేంద్రాలకు బొగ్గు సరఫరా సమీక్షలో మంత్రి జి.కిషన్‌రెడ్డి..**

గోదావరిఖని, జనంసాక్షి :

దేశంలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వ బొగ్గు ఉత్పత్తి సంస్థలు తమతో ఇంధన సరఫరా ఒప్పందం ఉన్న థర్మల్ విద్యుత్ కేంద్రాలకు తగినంత బొగ్గును సరఫరా చేస్తూ సహకరించాలని, సింగరేణి సంస్థ కూడా తనతో ఇంధన ఒప్పందం గల థర్మల్ విద్యుత్ కేంద్రాలకు ఎప్పటి లాగే తగినంత బొగ్గును అందించాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి ఆదేశించారు.మంగళవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దేశ వ్యాప్త ప్రభుత్వ బొగ్గు ఉత్పత్తి సంస్థలతో థర్మల్ కేంద్రాలకు బొగ్గు సరఫరాపై ప్రత్యేక సమీక్షను నిర్వహించారు. ఈ వీడియో సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో 28 థర్మల్ విద్యుత్ కేంద్రాల వద్ద తక్కువ బొగ్గు నిల్వలు ఉన్నాయని, ఈ థర్మల్ విద్యుత్ కేంద్రాలకు బొగ్గు సరఫరా చేసే ప్రభుత్వ సంస్థలు తక్షణమే స్పందించి ఎటువంటి బొగ్గు కొరత లేకుండా బొగ్గు రవాణాను పెంచాలని ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో కోల్ ఇండియాతో పాటు సింగరేణి సంస్థ ఇంకా ఇతర ప్రభుత్వ సంస్థల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ ఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి మాట్లాడుతూ సింగరేణి సంస్థ తనతో ఇంధన ఒప్పందం గల థర్మల్ విద్యుత్ కేంద్రాలకు తగినంత బొగ్గును సరఫరా చేస్తుందని, ఇకపై కూడా పెరుగుతున్న విద్యుత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని తగినంత బొగ్గు అందించడానికి కృషి చేస్తామని తెలిపారు.హైదరాబాద్ సింగరేణి భవన్ నుండి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సంస్థ చైర్మన్ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతితో పాటు డైరెక్టర్ (పర్సనల్ అండ్ ఫైనాన్స్)గౌతమ్ పోట్రు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్ మూవ్ మెంట్) బి.వెంకన్న, జనరల్ మేనేజర్ (కోఆర్డినేషన్ అండ్ మార్కెటింగ్) తాడబోయిన శ్రీనివాస్, కొత్తగూడెం హెడ్ ఆఫీస్ నుంచి సంస్థ డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్.వి.సూర్యనారాయణ, డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్) కె.వెంకటేశ్వర్లు, డైరెక్టర్ (ఈ అండ్ ఎం) ఎం.తిరుమలరావు పాల్గొన్నారు.



## గ్రామ పంచాయతీ పాలకవర్గంచే ఎంపీడీవోకు ఘన సన్మానం

**భిక్నూరు సెప్టెంబర్ 01 (జనం సాక్షి):**

భిక్నూరు మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామపంచాయతీకి మంగళవారం మొదటిసారిగా వచ్చిన సందర్భంలో ఎంపీడీవో సవితారెడ్డిని గ్రామ పంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు, ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ,గ్రామ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు, అనంతరం గ్రామంలో పలుగడ్డ బిసికాలనీలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు దుస్తులను పంపిణీ చేశారు, ఈకార్యక్రమంలో సర్పంచ్ కోడూరి సాయగౌడ్,ఉపసర్పంచ్ పట్లూరి చైతన్య కొండల్ రెడ్డి, వార్డు సభ్యులు వడ్ల శ్రీనివాస్ చారి, పిల్లి బాబు, మాధవరెడ్డి,బుచ్చయ్య, నట్టలింగం తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ లో ఉన్న స్కాలర్ షిప్ వెంటనే విడుదల చేయాలి

**భిక్కనూరు చౌరస్తాలో టీజీవిపి ఆధ్వర్యంలో విద్యార్థులు ధర్నా**

**భిక్నూరు సెప్టెంబర్ 01 (జనం సాక్షి):**



భిక్నూరు మండల కేంద్రంలో (టీజీవిపి) తెలంగాణ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో చౌరస్తాలో విద్యార్థులు ధర్నా నిర్వహించారు, ఈసందర్భంగా కామారెడ్డి జిల్లా అధ్యక్షులు గంధం సంజయ్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడుస్తున్న విద్యార్థుల సమస్యలపై తగిన శ్రద్ధ చూపడం లేదని విమర్శించారు, విద్యార్థులకు కావలసిన సౌకర్యాలు అందించకుండా స్కాలర్ షిప్ లను ఎత్తివేసే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ,రాష్ట్రంలో సుమారు రూ.15 వేలకోట్ల రూపాయల స్కాలర్ షిప్,ఫీజు రియంబర్స్ మెంట్ పెండింగ్లో ఉన్న బకాయిలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వ తీరును నిరసిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు, ప్రభుత్వం స్పందించకుంటే విద్యార్థుల ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు, అవసరమైతే అసెంబ్లీని ముట్టడించేందుకు కూడా వెనకాడబోమని స్పష్టం చేశారు, ఈ కార్యక్రమంలో కామారెడ్డి నియోజకవర్గ ఇంచార్జ్ ఎండి షామీర్ ఖాన్, మండల అధ్యక్షులు భరత్ రాజ్, విజయ్, మండల మహిళా ఉపాధ్యక్షురాలు అంకిత, శిరీష మహాలక్ష్మితో పాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.



## సిద్దుల గుట్ట సాక్షిగా రేవంత్ రెడ్డి హామీలను మరిచారు ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి వ్యాఖ్యలు

**ఆర్మూర్, సెప్టెంబర్ 1 (జనంసాక్షి):**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం సిద్దులగుట్ట సాక్షిగా సంవత్సర కాలంలో 420 హామీలను నెరవేరుస్తామని ఒట్టేసి చెప్పిన సీఎం రేవంత్ రెడ్డి ఏమయ్యారని ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి ప్రశ్నించారు.ఆర్మూర్ పట్టణంలోని సిద్దుల గుట్ట ఆలయాన్ని దర్శించుకుని మీడియా సమావేశం ఏర్పాటు చేసి వారు మాట్లాడారు.తెలంగాణలో కాంగ్రెస్ పాలన వచ్చి వెయ్యి రోజులవుతున్న నెరవేర్చకుండా సీఎం రేవంత్ రెడ్డి ప్రజలకు బాకీ పడ్డ హామీలను కార్డులతో ప్రదర్శించారు.తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ను తిట్టడమే పనిగా పెట్టుకున్న రేవంత్ రెడ్డి ఎగ్గొట్టు,కుల కొట్టు చెడగొట్టు అనే సిద్ధాంతాన్ని అనుసరిస్తున్నాని ఎద్దేవా చేశారు. సిద్దులగుట్ట శివయ్య సాక్షిగా గెలిచిన ఏడాదిలోపే 420 హామీలను అమలు చేస్తామన్న రేవంత్ రెడ్డి ప్రజలను మోసగించారన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు, వృద్ధులకు, దివ్యాంగులకు,నిరుద్యోగ భృతి ప్రజలకు పంచడంలో విఫలమైందన్నారు.పేద బడుగు బలహీన వర్గాల ఇండ్లను కొల్లగొట్టి హైడ్రా పేరుతో వంచించిందన్నారు. ఆర్మూర్ నియోజకవర్గంలో ప్రతి ఇంటికి కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన బాకీ కార్డులను పంచుతూ బిఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు బహిర్గతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ పట్టణ అధ్యక్షుడు పూజ నరేందర్, సర్పంచ్ కిరణ్,మాజీ వైస్ ఎంపీపీ గంగాధర్, సొసైటీ చైర్మన్లు,బిఆర్ఎస్ కౌన్సిలర్లు, నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణీ

**సదాశివనగర్ సెప్టెంబర్1 (జనంసాక్షి):**

సదాశివనగర్ మండలంలోని వజ్జేపల్లి తండాలో ఐకేపీ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ సంధ్య-విజయ్ కుమార్ చేతుల మీదుగా విద్యార్థులకు దుస్తులు అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలోని పిల్లలందరినీ తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి నాణ్యమైన విద్యను అందుకునేలా చూడాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అర్హత కలిగిన ఉపాధ్యాయుల ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందుతుందని తెలిపారు. క్రమశిక్షణతో చదివి మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రవీణ్, ఉపసర్పంచ్ రవీందర్, వీవోఏ సురేందర్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.




### జిల్లా స్థాయి సైన్స్ డ్రామా పోటీల్లో
# విజయ్ హై స్కూల్ కు ద్వితీయ స్థానం

**ఆర్మూర్, సెప్టెంబర్ 1 (జనంసాక్షి):**
నిజామాబాద్ జిల్లా స్థాయిలో నిర్వహించిన సైన్స్ డ్రామా (నాటిక) పోటీలలో ఆర్మూర్ పట్టణానికి చెందిన విజయ్ హై స్కూల్ విద్యార్థులు అద్భుత ప్రదర్శన కనబరిచి రెండవ స్థానాన్ని గెలుపొందారు.సమకాలీన అంశాన్ని ఎంచుకుని విద్యార్థులు చేసిన ప్రదర్శన అందరినీ విశేషంగా ఆకట్టుకుంది.నాటిక శీర్షికైన కనిపించని మిత్రుడా – కబళించే శత్రువా?,ఇతివృత్తం :కృత్రిమ మేధస్సు లాభనష్టాలు,మారుతున్న సాంకేతిక యుగంలో ఏఐ ఏ విధంగా మనిషికి అదృశ్య మిత్రుడిగా అండగా నిలుస్తుందో చెబుతూనే,దానిపై మితిమీరి ఆధారపడితే భవిష్యత్తులో అది మనిషిని ఎలా కబళించే శత్రువుగా మారనుందో విద్యార్థులు తమ అద్భుతమైన నటన ద్వారా కళ్లకు కట్టినట్లు చాలా చక్కగా వివరించారు.టెక్నాలజీని ఎంతవరకు వాడాలో ఆలోచింపజేసేలా ఈ నాటిక సాగింది.ఈ నాటికలో విద్యార్థులు కనబరిచిన ప్రతిభకు గాను న్యాయ నిర్ణేతలు వారిని ద్వితీయ బహుమతికి ఎంపిక చేశారు. జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రదర్శన ఇచ్చి పాఠశాలకు కీర్తి ప్రతిష్టలు తీసుకువచ్చిన విద్యార్థులను,అలాగే వారి వెన్నంటి ఉండి ప్రోత్సహించిన గైడ్ టీచర్లను విజయ్ హైస్కూల్ కరస్పాండెంట్ టి. కవితా దివాకర్,ప్రిన్సిపాల్ జి.రమాదేవి, ఉపాధ్యాయ బృందాన్ని విజయ్ విద్యాసంస్థల అధినేత డా.అమృతలతగారు ప్రత్యేకంగా అభినందించారు.

# రైతు పోరాటాలకు కొత్త నాయకత్వం..

### ఏఐయుకెఎస్ డివిజన్ ప్రధాన కార్యదర్శిగా రిక్క దామోదర్
### ఉపాధ్యక్షుడిగా ఎం. నారగౌడ్.. డివిజన్ కమిటీ సభ్యుడిగా సర్పంచ్ సాయులు

**సిరికొండ, సెప్టెంబర్ 1 (జనంసాక్షి):**
అఖిల భారత ఐక్య రైతు సంఘం (ఏఐయుకెఎస్) ఆర్మూర్ డివిజన్‌కు నూతన నాయకత్వం ఏర్పడింది. డివిజన్ ప్రధాన కార్యదర్శిగా సిరికొండ మండలం రావుట్ల గ్రామానికి చెందిన రిక్క దామోదర్‌ను, ఉపాధ్యక్షుడిగా గడ్కోల్ గ్రామానికి చెందిన ఎం. నారగౌడ్‌ను, డివిజన్ కమిటీ సభ్యుడిగా బట్టు సర్పంచ్ సాయులును ప్రతినిధులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ విషయాన్ని ఏఐయుకెఎస్ జిల్లా కోశాధికారి ఎం. లింబాద్రి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.కమ్మర్‌పల్లిలో నిర్వహించిన ఏఐయుకెఎస్ ఆర్మూర్ డివిజన్ జనరల్ కౌన్సిల్ సమావేశంలో ప్రతినిధులు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. రైతుల సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహిస్తూ, రైతాంగ హక్కుల కోసం ఉద్యమాలను బలోపేతం చేయడమే లక్ష్యంగా నూతన కమిటీ పనిచేయనున్నట్లు తెలిపారు.రిక్క దామోదర్ గతంలో పీడీఎస్‌యూ విద్యార్థి సంఘంలో సుదీర్ఘకాలం పనిచేశారని, అనంతరం పీవైఎల్ యువజన సంఘంలో కూడా పనిచేశారని లింబాద్రి తెలిపారు. అలాగే సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ పార్టీ సీనియర్ నాయకుడిగా పనిచేసిన అనుభవం ఆయనకు ఉందన్నారు. విద్యార్థి, యువజన ఉద్యమాలతో పాటు ప్రజా, రైతాంగ సమస్యలపై పోరాటాల్లో ఆయన చేసిన కృషిని గుర్తించి ఏఐయుకెఎస్ ఆర్మూర్ డివిజన్ ప్రధాన






కార్యదర్శిగా ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.అదేవిధంగా సిరికొండ మండలం గడ్కోల్ గ్రామానికి చెందిన ఎం. నారగౌడ్ గత 20 ఏళ్లుగా రైతాంగ పోరాటాల్లో కీలకంగా పనిచేస్తున్నారని తెలిపారు. సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్‌లో సీనియర్‌గా సేవలందించిన ఆయన అనుభవాన్ని పరిగణనలోకి తీసుకుని ఆర్మూర్ డివిజన్ ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.డివిజన్ కమిటీ సభ్యుడిగా బట్టు సర్పంచ్ సాయులును ఎన్నుకున్నట్లు లింబాద్రి తెలిపారు. నూతనంగా ఎన్నికైన నాయకత్వం రైతుల సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారం కోసం ఉద్యమాలను మరింత విస్తృతం చేయాలని ఆయన ఆకాంక్షించారు. రైతాంగాన్ని ఐక్యం చేసి వారి హక్కుల కోసం నిరంతరం పోరాటాలు కొనసాగిస్తామని తెలిపారు.

## సీపీఎస్‌కు చరమగీతం పాడాలి..
## ఓపీఎస్‌ను పునరుద్ధరించాలి

**పెన్షన్ విద్రోహ దినంలో టీజీఈ జేఏసీ జిల్లా కో చైర్మన్ ఎం. బాలయ్య**

**సిరికొండ, సెప్టెంబర్ 1:(జనంసాక్షి):**
ఉద్యోగుల పాలిట శాపంగా మారిన నూతన పెన్షన్ విధానం (సీపీఎస్)ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)ను వెంటనే పునరుద్ధరించాలని టీజీఈ జేఏసీ జిల్లా కో చైర్మన్ ఎం. బాలయ్య డిమాండ్ చేశారు.సిరికొండ మండలంలోని చీమన్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం "పెన్షన్ విద్రోహ దినం" నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం. బాలయ్య మాట్లాడుతూ.. ఉద్యోగులు, ఉపాధ్యాయుల భవిష్యత్ ఆర్థిక భద్రతకు పాత పెన్షన్ విధానం ఎంతో కీలకమన్నారు. నూతన పెన్షన్ విధానం వల్ల ఉద్యోగులకు పదవీ విరమణ అనంతరం ఆర్థిక భద్రతపై అనిశ్చితి నెలకొంటోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వి. శ్రీనివాస్, నాయకులు గంగదాసు, ఎం. జవహర్‌లాల్, రవి, బాలాజీ, సతీష్, గంగాధర్, నరేష్, ప్రేమ్, గజన్‌రావు తదితరులతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పాత పెన్షన్ కోసం గళమెత్తిన ఉపాధ్యాయులు

**రావుట్లలో "పెన్షన్ విద్రోహ దినం" నిరసన**

**సిరికొండ, సెప్టెంబర్ 1(జనంసాక్షి):**
నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ సిరికొండ మండలం రావుట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల్లో మంగళవారం "పెన్షన్ విద్రోహ దినం" నిరసన




కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ నూతన పెన్షన్ విధానం ఉద్యోగుల భవిష్యత్ భద్రతకు భరోసా లేకుండా చేస్తోందని అన్నారు. ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.కార్యక్రమంలో బి. దేవి సింగ్, కె. రవి, సుధీర్, ఉమా శేఖర్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజేత, ఉపాధ్యాయులు పోశెట్టి, వీణ, శివాని తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టును పరామర్శించిన అయ్యప్ప శ్రీనివాస్

**ఆర్మూర్,సెప్టెంబర్ 1 (జనంసాక్షి):**
ఆర్మూర్ పట్టణానికి చెందిన ప్రముఖ జర్నలిస్ట్ కలిగోట చిన్నారెడ్డిని అయ్యప్ప ఫౌండేషన్ చైర్మన్ అయ్యప్ప శ్రీనివాస్



మంగళవారం పరామర్శించారు. నిజామాబాదులో చికిత్స పొంది ఇటీవల ఇంటికి చేరుకున్న వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా అయ్యప్ప శ్రీనివాస్ మాట్లాడుతూ జర్నలిస్ట్ చిన్న త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి తన విధుల్లో పాల్గొనాలని ఆకాంక్షించారు.ఆయనకు ధైర్యం చెప్పి, ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరామర్శలో ఫౌండేషన్ సభ్యులు పేర్ ఒడ్డెన్న,చిన్నరెడ్డి, లింగం, నరేష్,వజ్ర ఒడ్డన్న (మామిడిపల్లి), చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కామారెడ్డి జిల్లాలో మొబైల్ ఫోన్ల రికవరీకి ప్రత్యేక చర్యలు

**○ఈ ఏడాది ఇప్పటివరకు రూ.1.81 కోట్ల విలువైన 1,133 ఫోన్లు రికవరీ**
**○గత 20 రోజుల్లోనే రూ.23 లక్షల విలువైన 139 ఫోన్ల స్వాధీనం**

**కామారెడ్డి, జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 1 (జనంసాక్షి):**
మొబైల్ ఫోన్ పోయినా, చోరీకి గురైనా ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కామారెడ్డి జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర, ఐపీఎస్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన కేంద్ర పరికరాల గుర్తింపు నమోదు (సీఈఐఆర్) పోర్టల్ ద్వారా పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను గుర్తించి తిరిగి పొందే అవకాశం ఉందన్నారు.ప్రస్తుత డిజిటల్ యుగంలో మొబైల్ ఫోన్ కేవలం సమాచార సాధనం మాత్రమే కాకుండా బ్యాంకింగ్ వివరాలు, వ్యక్తిగత ఫొటోలు, ఇతర ముఖ్యమైన సమాచారాన్ని కలిగి ఉంటుందని ఎస్పీ పేర్కొన్నారు. ఫోన్ పోగొట్టుకోవడం వల్ల వ్యక్తిగత భద్రత, గోప్యతకు ముప్పు ఏర్పడే అవకాశం ఉన్నందున మొబైల్ ఫోన్ల రికవరీపై జిల్లా పోలీసు యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు.ప్రత్యేక సాంకేతిక బృందం ఏర్పాటుపోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను త్వరితగతిన గుర్తించి బాధితులకు అందించేందుకు ఇన్‌స్పెక్టర్ సంపత్ పర్యవేక్షణలో ఆర్ఎస్ఐ బాలరాజు, ఐదుగురు కానిస్టేబుళ్లతో ప్రత్యేక సాంకేతిక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని




మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అప్పగించినట్లు ఎస్పీ వివరించారు.

వినియోగిస్తూ ఈ బృందం ప్రతినెలా సగటున 150కి పైగా మొబైల్ ఫోన్లను రికవరీ చేస్తోందని అభినందించారు.20 రోజుల్లో 139 ఫోన్లు రికవరీఇటీవల నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా గత 20 రోజుల్లో రూ.23 లక్షల విలువైన 139 మొబైల్ ఫోన్లను రికవరీ చేసినట్లు ఎస్పీ వెల్లడించారు. ఈ ఏడాది ఇప్పటివరకు సుమారు రూ. 1.81 కోట్ల విలువైన 1,133 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.గత ఏడాది కూడా సుమారు రూ.3 కోట్ల విలువైన 1,834

సీఈఐఆర్ ద్వారా 5,414 ఫోన్ల గుర్తింపుకేంద్ర ప్రభుత్వ సీఈఐఆర్ పోర్టల్ అందుబాటులోకి వచ్చినప్పటి నుంచి కామారెడ్డి జిల్లాలో ఇప్పటివరకు 5,414 మొబైల్ ఫోన్లను గుర్తించినట్లు ఎస్పీ తెలిపారు. వీటి విలువ సుమారు రూ.8.66 కోట్లు ఉంటుందని పేర్కొన్నారు. గుర్తించిన ఫోన్లను బాధితులకు విజయవంతంగా అప్పగించినట్లు వివరించారు.మొబైల్ ఫోన్ల రికవరీలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ప్రత్యేక సాంకేతిక బృందాన్ని ఎస్పీ అభినందించారు.ఫోన్ పోయిన వెంటనే ఏం చేయాలి?మొబైల్ ఫోన్ పోయిన వెంటనే ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని ఎస్పీ సూచించారు.ఆలస్యం చేయకుండా సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి.దుర్వినియోగానికి అవకాశం లేకుండా సిమ్ కార్డును వెంటనే నిలిపివేయాలి.మొబైల్ ఫోన్ ఐఎంఈఐ నంబర్‌ను సీఈఐఆర్ పోర్టల్‌లో నిలిపివేయాలి.పోయిన ఫోన్ ద్వారా సైబర్ మోసాలు జరిగే అవకాశం ఉన్నందున అనుమానాస్పద కాల్స్, గుర్తుతెలియని లింకుల పట్ల అప్రమత్తంగా ఉండాలి.రికవరీ అయిన ఫోన్ కోసం సంప్రదించాలిరికవరీ అయిన మొబైల్ ఫోన్లను పొందేందుకు బాధితులు తమ వద్ద ఉన్న సంబంధిత ధ్రువపత్రాలతో జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆర్ఎస్ఐ బాలరాజు ? 8712686114ను సంప్రదించాలని పోలీసులు సూచించారు.

# ఆర్థోపెడిక్ కేర్,రోబోటిక్ జాయింట్ రీప్లేస్మెంట్ సేవలను అందిస్తున్నాం

## - ఆర్థోపెడిక్ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ లోకేష్ కుమార్ గుప్తా




**ఆర్మూర్, సెప్టెంబర్ 1 (జనంసాక్షి):** అత్యధిక రోబోటిక్ జాయింట్ రిప్లేస్మెంట్ చికిత్సలను పేషెంట్లకు మరింత చేరువగా అందిస్తున్నామని సీనియర్ కన్సల్టెంట్ ఆర్థోపెడిక్ మరియు రోబోటిక్ జాయింట్ రీప్లేస్మెంట్ సర్జన్ డాక్టర్ లోకేష్ కుమార్ గుప్తా అన్నారు. యశోద హాస్పిటల్ సోమాజిగూడ ఆధ్వర్యంలో ఆర్మూర్ పట్టణంలోని మహాలక్ష్మి కాలనీలో గల లక్ష్మీ నారాయణ ఫిజియోథెరపీ ఆస్పత్రిలో మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. అత్యా ధునిక ఆర్థోపెడిక్ కేర్లు, రోబోటిక్-అసిస్టెడ్ జాయింట్ రిప్లేస్మెంట్ సర్జరీలను పేషేంట్లకు మరింత చేరువ చేస్తున్నామన్నారు.. ఆర్థోపెడిక్ విభాగంలో రోబోటిక్ జాయింట్ రీప్లేస్మెంట్, కాంప్లెక్స్ ట్రామా (తీవ్రమ ?న గాయాలు),కీహోల్ సర్జరి లిగమెంట్ గాయాలకు చికిత్స చేయడంలో ప్రత్యేక నైపుణ్యం ఉన్నామన్నారు.రోబోటిక్ టెక్నాలజీ ద్వారా అత్యంత కచ్చితత్వంతో కూడిన,పేషెంట్ కు సరిపోయే ప్లానింగ్ సాధ్యమవుతుందన్నారు. జాయింట్ రీప్లేస్మెంట్ విజయవంతం కావడంలో టెక్నాలజీ అనేది ఒక భాగం మాత్రమే నని,పేషెంట్లకు అత్యు త్తమ ఫలితాలు అందించాలంటే డాక్టర్ కి ఉన్న క్లినికల్ నైపుణ్యం, జాగ్రత్తా పరీక్షించడం,సరైన పేషెంట్ కు సరైన విధానం ద్వారా చికిత్స అందుతుందన్నారు. ప్రతి నెల మొదటి మంగళవారం ఆర్మూ ర్లోని లక్ష్మీ నారాయణఫిజియోథెరపీ క్లినిక్ లో పేషెంట్లకు కన్సల్టెంట్ సేవలను అందిస్తామని చెప్పారు. యశోద గ్రూప్ ప్రపంచ స్థాయి ఆరోగ్య సేవలను తక్కువ ధరలకే అవసరాల ప్రజలకు అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వినయ్ కుమార్, మార్కెటింగ్ మేనేజర్లు అమర్నాథ్, రూపేష్ షిండే పాల్గొన్నారు.



## ఎస్ఐఆర్ నోటీసులను పరిశీలించిన మున్సిపల్ చైర్పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 1 (జనంసాక్షి)** జిల్లా కేంద్రంలోని అటవీ శాఖ కార్యాలయం, ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎస్ఐఆర్ నోటీసుల పరిశీలన కేంద్రాలను మున్సిపల్ చైర్పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా నోటీసులు అందుకున్న ప్రజలతో మాట్లాడి, వారికి ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా చైర్పర్సన్ మాట్లాడుతూ.. 2002 నాటి ఓటరు జాబితాతో ప్రస్తుత ఓటరు జాబితాను సరిపోల్చే క్రమంలో అనేక మందికి ఎస్ఐఆర్ నోటీసులు అందుతున్నాయని తెలిపారు. పేర్లలో చిన్నపాటి అక్షర దోషాలు, వివరాల్లో స్వల్ప వ్యత్యాసాలు ఉన్నప్పటికీ కొంతమందికి నోటీసులు వస్తున్నాయని పేర్కొన్నారు.నోటీసులు అందుకున్న ప్రజలు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆమె స్పష్టం చేశారు. తమ వద్ద ఉన్న తగిన ఆధారాలను సంబంధిత బీఎల్ఓలకు అందజేసి, ఎస్ఐఆర్ ప్రక్రియ సజావుగా పూర్తయ్యేందుకు అధికారులు, బీఎల్ఓలకు సహకరించాలని సూచించారు. ప్రతి ఒక్కరికీ ప్రక్రియపై స్పష్టమైన అవగాహన కల్పించేలా అధికారులు ప్రజలకు సులభంగా అర్థమయ్యే విధంగా వివరించాలని అధికారులను కోరారు.ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రజలకు ఎలాంటి సందేహాలు ఉన్నా సంబంధిత అధికారులు, బీఎల్ఓలను సంప్రదించి ఆధారాలతో తమ వివరాలను పరిశీలించుకోవాలని చైర్పర్సన్ సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పర్వతాలు, కౌన్సిలర్లు అంజాద్, కాళ్ల గణేష్, రామ్మోహన్, కో-ఆప్షన్ సభ్యుడు ముబాషీర్, సంబంధిత అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.



# సింగం ఫ్యాషన్ హౌస్ ప్రారంభం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన మున్సిపల్ చైర్పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 1 (జనంసాక్షి)** జిల్లా కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన 'సింగం ఫ్యాషన్ హౌస్' ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ఫ్యాషన్ హౌస్ను ప్రారంభించారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్పర్సన్ మాట్లాడుతూ సింగం ఫ్యాషన్ హౌస్ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా కేంద్ర ప్రజలకు నాణ్యమైన వస్త్రాలు, ఆధునిక ఫ్యాషన్ ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. వ్యాపారం విజయవంతంగా కొనసాగుతూ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.సింగం ఫ్యాషన్ హౌస్ యజమాని నాగరాజు మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా వివిధ రకాల వస్త్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ముఖ్యంగా చిన్నారులకు సంబంధించిన వివిధ రకాల డ్రెస్సులతో పాటు పెద్దలకు అవసరమైన అన్ని రకాల దుస్తులు అందుబాటులో ఉంటాయని చెప్పారు. వినియోగదారుల కోసం ప్రత్యేక ఆఫర్గా బజాజ్ ఎలక్ట్రిసిటీ స్కూటీ రూ.2,000కు పైగా కొనుగోలు చేసిన వారికి స్కూటీని లక్కీ డ్రా ద్వారా అందించనున్నట్లు వెల్లడించారు. లక్కీ డ్రాలో విజేతగా నిలిచిన వారికి స్కూటీని అందజేస్తామని తెలిపారు.ప్రారంభోత్సవ కార్యక్రమంలో కౌన్సిలర్లు అంజాద్, రామ్మోహన్, కాళ్ల గణేష్, కో-ఆప్షన్ సభ్యుడు ముబాషీర్, నాయకులు నాగరాజు, రాములు, వేణు, వ్యాపార యజమాన్యం నాగరాజు, అన్వేష్, రాకేష్, గౌతమ్, మనోజ్, నిర్వాహకులు, ప్రజాప్రతినిధులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

### బాధ్యతగా వాహనాలు నడపాలి.. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

### ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్, సైబర్ నేరాలపై అవగాహన కల్పించిన కామారెడ్డి పోలీసులు



**కామారెడ్డి, జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 1( జనం సాక్షి)** కామారెడ్డి పట్టణ పోలీస్స్టేషన్ పరిధిలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రత, సైబర్ నేరాలపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. పట్టణ సీఐ నరహరి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి కామారెడ్డి డీఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై ఆటో డ్రైవర్లకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు బాధ్యతాయుతంగా వాహనాలు నడిపి ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రతి వాహనానికి తప్పనిసరిగా చెల్లుబాటు అయ్యే ఇన్సూరెన్స్ ఉండాలని, డ్రైవింగ్ సమయంలో ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని తెలిపారు. ప్రయాణికుల భద్రతతో పాటు తమ ప్రాణ భద్రతను కూడా దృష్టిలో ఉంచుకుని వాహనాలు నడపాలని సూచించారు.

**ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు**

కామారెడ్డి పట్టణ ట్రాఫిక్ ఎస్సై చంద్రశేఖర్ గౌడ్ మాట్లాడుతూ ప్రతి ఆటో డ్రైవర్ తప్పనిసరిగా యూనిఫాం ధరించాలని, ట్రాఫిక్ సిగ్నల్స్ను గౌరవించాలని సూచించారు. రాంగ్ రూట్లో వాహనాలు నడపడం, డ్రైవింగ్ సమయంలో సెల్ఫోన్ మాట్లాడడం, మద్యం సేవించి వాహనం నడపడం వంటి చర్యలకు పాల్పడవద్దని హెచ్చరించారు.అలాగే ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించకూడదని, ఓవర్లోడ్కు దూరంగా ఉండాలని తెలిపారు. రోడ్డు భద్రతా నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

**సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి**

కార్యక్రమంలో సైబర్ క్రైమ్ ఎస్సై నరేష్, రామంచ తిరుపతి టీం సభ్యులు ఆటో డ్రైవర్లకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, అనుమానాస్పద లింకులు, మోసపూరిత సందేశాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీ, పిన్ వంటి వ్యక్తిగత సమాచారాన్ని ఎవరితోనూ పంచుకోవద్దని, అనుమానం కలిగించే లింకులను క్లిక్ చేయవద్దని వివరించారు.ప్రజలకు లేదా వాహనదారులకు సంబంధించిన ఏదైనా ముఖ్యమైన సమాచారం తమ దృష్టికి వచ్చినప్పుడు వెంటనే పోలీసులకు తెలియజేసి సహకరించాలని పోలీసులు కోరారు.ఈ అవగాహన సదస్సులో ఆటో డ్రైవర్ యూనియన్ సభ్యులతో పాటు పెద్ద సంఖ్యలో ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు. ఇకపై ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రయాణికులకు సురక్షితమైన ప్రయాణాన్ని అందించడంతో పాటు కామారెడ్డి పోలీసులకు పూర్తి సహకారం అందిస్తామని ఆటో డ్రైవర్లు తెలిపారు.



# రాహుల్ గాంధీపై ఎఫ్ఐఆర్ రద్దు చేయాలి

## కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్

సిరిసిల్ల టౌన్ సెప్టెంబర్ 1 (జనంసాక్షి)



సభ్య సమాజం తలదించుకునేలా మోడి ప్రభుత్వం చేస్తుందని, మత తత్వాన్ని, కులవిక్షను కొనసాగిస్తుందని, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ విమర్శించారు.రాహుల్ గాంధీపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ ఆధ్వర్యంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా సంగీతం శ్రీనివాస్ మాట్లాడుతూ ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీలో మల్లికార్జున్ ఖర్గే ప్రసంగించిన వేదికను గంగాజలంతో శుద్ధి చేసిన బీజేపీ, ఆర్ఎస్ఎస్ నాయకులపై చర్యలు తీసుకోవాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేస్తే, ఆయనపైనే ఎఫ్ఐఆర్ నమోదు చేయడం అన్యాయమన్నారు. రాహుల్ గాంధీపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను తీవ్రంగా ఖండిస్తూ వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు తో పాటు వార్డు అధ్యక్షులు, గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ చిత్ర పటానికి బిఆర్ఎస్ నాయకులు పాలాభిషేకం

గంగాధర సెప్టెంబర్ 01 (జనంసాక్షి):



మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యానాలను తీవ్రంగా ఖండిస్తున్నామని బిఆర్ఎస్ నాయకులు మంగళవారం కేసీఆర్ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు.మధురానగర్ ఎక్స్ రోడ్డు చౌరస్తాలో కేసీఆర్ చిత్ర పటానికి పాలాభిషేకం చేసి మాజీ ఎమ్మెల్యే సుంకె రవి శంకర్ మాట్లాడుతూ కేసీఆర్ ను పంధా నందా అని మాట్లాడిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే పంది అని అన్నారు.ఇచ్చిన హామీలను అమలు చేయని పంది అబద్దాల పంది కేసీఆర్ పెట్టిన సంక్షేమ పథకాలను బంధు చేసిన పంది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే పంది అని అన్నారు.వెంటనే కేసీఆర్ పై చేసిన వ్యాఖ్యలను వెనుకకు తీసుకుని కేసీఆర్ కు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మేచినేని నవీన్ రావు.నాయకులు సాగి మహిపాల్ రావు.వేముల దామోదర్.మడ్లపెల్లి గంగాధర్.జోగు సాగర్.వడ్లూరి ఆదిమల్లు.ముక్కెర మల్లేశం.శ్రీమల్ల మెగరాజ్.బొల్లాడి శ్రీనివాస్ రెడ్డి.మామిడి అఖిల్.లింగాల దుర్గయ్య. నరోత్తంరెడ్డి.వెంకటేశ్వర్ రావు.గడ్డం స్వామి.మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

### రైతులను ఇబ్బంది పెట్టకుండా యూరియాని అందించాలి

బాల్కొండ న్యూస్ 1 సెప్టెంబర్( జనం సాక్షి)



బాల్కొండ మండల కేంద్రంలోని ప్రాథమిక సొసైటీ కార్యాలయం ముందు రైతులు యూరియా కోసం ఆందోళన నిర్వహించారు. సెక్రటరీ వేణు నిర్లక్ష్యమే ప్రధాన కారణమని రైతులు ఆరోపించారు. యూరియా రైతులకు సకాలంలో అందకపోతే మేమేం చేయాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రైతులు వ్యవసాయం చేయొద్దా అని ప్రశ్నించారు. సెక్రటరీ వేణు రైతులకు ఇబ్బందులు గురి చేయవద్దని, రైతులకు సహకరించాలని వారు డిమాండ్ చేశారు. వెంటనే రైతులకు సరిపడా యూరియా అందించాలని లేనిపక్షంలో ఆందోళన బాట చేయబడతామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.



ఇందల్వాయి మండలంలోని గన్నారం గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డ్ పంపిణీ కార్యక్రమంలో పంపిణీ చేయడం జరిగింది ఇందులో జిపియు రాజేందర్ గన్నారం సెక్రటరీ శ్వేత గన్నారం గ్రామ సర్పంచ్ సుజాత శ్రీనివాస్ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి చేసిన స్మార్ట్ కార్డు పంపిణీ ఎంతో ఉపయోగకరమని కాంగ్రెస్ ప్రభుత్వం నుండి చెన్నె బియ్యం ఇవ్వడం గర్వకారణం అని అన్నారు ఎమ్మెల్యే భూపతి రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు బద్దం రెడ్డి గాండ్ల భైరయ్య గుండ్ల నవీన్ గౌండ్ల రాజా గౌడ్ , తోట భూమయ్య కుంట శ్రీనివాస్ కాంగ్రెస్ కార్యకర్తలు మరియు అధికారులు లబ్ధిదారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.




# పోగొట్టుకున్న సెల్ ఫోన్ అందజేత

కరీంనగర్, క్రైమ్ సెప్టెంబర్ 01(జనంసాక్షి ) :

దుర్శేడ్ చెందిన కొల్లూరి అంజయ్య గత సంవత్సరం కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్ లో తన యొక్క ఐక్యు సెల్ ఫోన్ పోగొట్టుకొనగా కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినాడు పోలీసులు సి.ఈ.ఐ.ఆర్ టెక్నాలజీ సహాయంతో పోగొట్టుకున్న సెల్ ఫోన్ ను ట్రేస్ చేసి పెద్దపల్లి లో పట్టుకోవడం జరిగింది.అట్టి ఫోను యజమాని కొల్లూరి అంజయ్య కు ఇన్స్పెక్టర్ ఏ.నిరంజన్ రెడ్డి సెల్ ఫోను అందజేశారు. సెల్ ఫోన్ ను ట్రేస్ చేయడంలో కృషి చేసిన టెక్ టీం కానిస్టేబుల్ చిట్యాల రాంసాయి, ఫైజాన్ లను సిఐ ఏ. నిరంజన్ రెడ్డి అభినందించారు.

# వినాయక నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

## వినాయక చవితి ఉత్సవాల కార్యక్రమాల్లో భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు

## అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి : మేయర్ కొలగాని శ్రీనివాస్

కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 01 (జనంసాక్షి) :

వినాయక చవితి ఉత్సవాలు, గణేష్ నిమజ్జన కార్యక్రమాలను నగరంలో ప్రశాంత వాతావరణంలో, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ఆదేశించారు. వినాయక చవితి ఉత్సవాలు, గణేష్ నిమజ్జన ఏర్పాట్లపై మున్సిపల్ కమిషనర్, సంబంధిత శాఖల అధికారులతో మేయర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలోని ప్రధాన రహదారులు, వినాయక మండపాలు ఏర్పాటు చేసే ప్రాంతాలు, గణేష్ విగ్రహాల ఊరేగింపు మార్గాలు, ప్రధాన కూడళ్లు, నిమజ్జన ప్రాంతాల్లో చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు.

### రోడ్ల మరమ్మతులు వెంటనే పూర్తి చేయాలి

గణేష్ విగ్రహాల ఊరేగింపు జరిగే ప్రధాన రహదారుల్లో గుంతలు, దెబ్బతిన్న రోడ్లను గుర్తించి ప్యాచ్ వర్క్‌ను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని మేయర్ ఆదేశించారు. అవసరమైన ప్రాంతాల్లో గ్రావెల్ వేయడంతో పాటు వర్షాల కారణంగా ఏర్పడిన గుంతలు, నీరు నిలిచే ప్రాంతాలను ప్రత్యేకంగా పరిశీలించి భక్తులు, వాహనదారులు, గణేష్ విగ్రహాలను తరలించే వాహనాలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.

### ప్రధాన ప్రాంతాల్లో ప్రత్యేక లైటింగ్

ప్రధాన కూడళ్లు, వినాయక మండపాలు, ఊరేగింపు మార్గాలు, నిమజ్జన పాయింట్ల వద్ద వీధి దీపాలు పూర్తిస్థాయిలో పనిచేసేలా చూడాలని విద్యుత్ విభాగం అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా టవర్ సర్కిల్‌తో పాటు ప్రధాన జంక్షన్లలో ప్రత్యేక లైటింగ్ ఏర్పాటు చేయాలని, మరమ్మతులకు గురైన వీధి దీపాలను వెంటనే సరిచేయాలని సూచించారు. నిమజ్జన సమయంలో రాత్రివేళ భక్తులు, పోలీసు, మున్సిపల్ సిబ్బందికి స్పష్టమైన వెలుతురు ఉండేలా అవసరమైన ప్రాంతాల్లో అదనపు లైటింగ్ సౌకర్యాలు ఏర్పాటు చేయాలని తెలిపారు.

### పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి



నిమజ్జన ప్రాంతాల్లో చెత్త పేరుకుపోకుండా ప్రత్యేక పారిశుధ్య బృందాలను ఏర్పాటు చేయాలని పారిశుధ్య విభాగాన్ని ఆదేశించారు. గణేష్ ఊరేగింపు జరిగే మార్గాల్లో ఎప్పటికప్పుడు చెత్తను తొలగించాలని, వినాయక మండపాల పరిసరాలు, ప్రధాన కూడళ్లు, నిమజ్జన ప్రాంతాల్లో ప్రతిరోజూ ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ... వినాయక చవితి నగర ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే ముఖ్యమైన పండుగ. వినాయక మండపాల ఏర్పాటు నుంచి గణేష్ నిమజ్జనం పూర్తయ్యే వరకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయడం నగరపాలక సంస్థ బాధ్యత. ప్రజలు, వినాయక మండపాల నిర్వాహకులు కూడా అధికారులకు సహకరించాలని మేయర్ విజ్ఞప్తి చేశారు. నిమజ్జన కార్యక్రమాల్లో ప్రభుత్వం, పోలీస్ శాఖ, నగరపాలక సంస్థ సూచించే మార్గదర్శకాలను ప్రతి ఒక్కరూ పాటించాలని కోరారు. కరీంనగర్ నగరంలో వినాయక ఉత్సవాలు, గణేష్ నిమజ్జనం ఆదర్శవంతంగా, ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు నగరపాలక సంస్థ అన్ని చర్యలు చేపడుతుందని మేయర్ తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, డీఈలు, ఇంజనీరింగ్ విభాగం అధికారులు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక రవాణా ఆటోను పట్టుకున్న ఆర్ఐ

బోధన్, సెప్టెంబర్ 1 ( జనంసాక్షి ) :

సాలూర మండలంలోని మందర్న, తగ్గేల్లి మంజీర పరివాహక ప్రాంతం నుంచి కొన్ని రోజులుగా యథేచ్ఛగా అక్రమ ఇసుక రవాణా సాగుతుంది. ఈ క్రమంలో మంగళవారం ఉదయం సాలూర మండల ఆర్ఐ శంకర్ ట్రాలీ ఆటోలో ఇసుక తరలిస్తుండగా సాలూర క్యాంపు మార్గమధ్యలో పట్టుకున్నారు. అనంతరం ఇసుకతో ఉన్న ట్రాలీ ఆటోను బోధన్ రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మంజీర పరివాహక ప్రాంతం తగ్గేలి నుండి రాత్రి వేళల్లో డోజర్ ద్వారా తిప్పర్ల,బొలెరోల,ట్రాక్టర్ల ద్వారా ఇసుక అక్రమంగా తరలింపు జరుగుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు స్థానికంగా వ్యక్తమవుతున్నాయి. ఇసుక అక్రమ రవాణాపై అధికారులు కఠిన చర్యలు తీసుకుని, ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్న అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.





## ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యూనిఫాం, షూ ల పంపిణి

**కమాన్‌పూర్, సెప్టెంబర్ 01, (జనంసాక్షి):**

పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు యూనిఫాంలను పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్, ఎంఈఓ ఇల్లందుల విజయ్‌కుమార్, ఏపీఎం పద్మ ఆధ్వర్యంలో విద్యార్థులకు యూనిఫాంలు అందజేశారు. రొంపికుంట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు గ్రామ సర్పంచ్ గుమ్మడి శ్రీనివాస్ చేతులమీదుగా యూనిఫామ్ లు పంపిణీ చేశారు. అలాగే నాగారం గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు గ్రామ సర్పంచ్ చేతుల మీదుగా శుభాకాంక్షలు శుభాకాంక్షలు షూ లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ఉపసర్పంచ్ లు మహమ్మద్ రఫీక్ సోహెల్, ఓడ్నాల శ్రీనివాస్, వార్డు సభ్యులు, సిసి బిక్షపతి, ఆదివరాహ టైలరింగ్ సెంటర్ మహిళలు, ఆయా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## భూగర్భ జలాల పెంపు కి "జలసిరి" పథకం

### ఎంపీడీఓ శైలజరాణి, సర్పంచ్ ప్రతిమ

**రామగిరి జనం సాక్షి 04:**

భూగర్భ జలాల పెంపుకే జలసిరి పథకమని ఎంపీడీఓ బద్రి శైలజ రాణి, సర్పంచ్ పల్లె.ప్రతిమ పీవీరావు అన్నారు. మంగళవారం రత్నాపూర్ గ్రామంలోని రామగిరి ఖిల్లా ప్రాంతంలోని మెగా పల్లె ప్రకృతి వనం ప్రాంతంలో రెండో ఫామ్ ఫండ్ నిర్మాణం పనులను సర్పంచ్ పల్లె ప్రతిమపీవీరావు, ఎంపీడీవో బద్రి శైలజా రాణి తో కలిసి ప్రారంభించారు. వి.బి.జి రామ్.జి ఉపాధి హామీ పథకం కింద ఈ నిర్మాణం జరుగుతుందన్నారు. 12 మీటర్ల పొడవు, 12 మీటర్ల వెడల్పు, 2 మీటర్ల లోతుతో నిర్మాణం జరుగుతుంది. రూ.1.27 లక్షల నిధులు మెటీరియల్ కొరకు కేటాయించారు. 260 మస్టర్లు కేటాయించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి ఏ.పీ.ఓ వరకొల్ల.మౌనిక, ఉపాధి టి.ఏ మల్కా అఖిల, సెక్రటరీ గంగుల సంతోష్, ఫీల్డ్ అసిస్టెంట్ సందవేన జ్యోతి పాల్గొన్నారు



## పి ఆర్ టి యు-టీఎస్ జమ్మికుంట మండల అధ్యక్షునిగా పంజాల కృష్ణమూర్తి..

**జమ్మికుంట, సెప్టెంబర్ 1 (జనంసాక్షి):**

జమ్మికుంటలో పి ఆర్ టి యు–టీఎస్ మండల స్థాయి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్య దర్శులు ఎ.కరుణాకర్ రెడ్డి, ఎం.జయపాల్ రెడ్డి హాజరయ్యారు. మంగళవారం నిర్వహించిన పి ఆర్ టి యు - టి ఎస్ ఎన్నికలో జమ్మికుంట మండల అధ్యక్షులుగా పంజాల కృష్ణమూర్తిని, ప్రధాన కార్య దర్శిగా సిహెచ్.ప్రవీణ్ కుమార్ ని అసోసియేట్ అధ్యక్షులుగా రవిందర్ రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ పీఆర్సీ ని వెంటనే ప్రకటించాలని, సిపిఎస్ ను రద్దు చేయలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు వెంకట రాజం,తిరుపతిరెడ్డి,రాజేంద్రప్రసాద్,ప్రభాకర్ రెడ్డి, అచ్చే మురళి, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.






## విద్యార్థుల హాస్టల్, మేస్ సమస్యలు పరిష్కరించాలి

**కరీంనగర్ కల్చరల్, సెప్టెంబర్ 1, ( జనంసాక్షి)**

శాతవాహన యూనివర్సిటీలో హాస్టల్, మేస్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు నిరసన చేపట్టారు. హాస్టల్ మేస్ బిల్లును తప్పనిసరిగా చెల్లించాలని, లేదంటే విద్యార్థులే వంట సామాగ్రి తెచ్చుకుని వంట చేసుకోవాలని అధికారులు సూచించడం పట్ల విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వీసీ, రిజిస్ట్రార్ వైఖరిని నిరసిస్తూ నినాదాలు చేశారు. మెస్ గ్రాసరీస్ ధరలను ఇష్టాను సారంగా పెంచి విద్యార్థులపై అదనపు ఆర్థిక భారం మోపుతున్నారని ఆరోపించారు. ధరల పెంపుపై అధికారులు స్పష్టత ఇవ్వాలని, విద్యార్థు లకు నాణ్యమైన భోజనం అందించాలని డిమాండ్ చేశారు. హాస్టల ˉలోని మౌలిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. యూనివర్సిటీలో ?10 కోట్లతో గ్రౌండ్, ?5 కోట్లతో గ్యాలరీ, ?60 లక్షలతో జిమ్ వంటి అభివృద్ధి పనులపై చూపుతున్న శ్రద్ధను 24/7 లైబ్రరీ, ప్రస్తుత గ్రౌండ్, హాస్టల్ మేస్ సమస్యల పరిష్కారంపై కూడా చూపాలని విద్యార్థులు అన్నారు. విద్యార్థుల సమస్యలను అధికారులు నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం కొనసాగిస్తామని, విద్యార్థుల హక్కుల కోసం ఐక్యంగా ఉద్యమిస్తామని విద్యార్థులు స్పష్టం చేశారు.

### బిజెపి స్టేట్ చీఫ్ రామచంద్రరావు

## హౌస్ అరెస్ట్ దుర్మార్గం - అప్రజా స్వామికం

### బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం

**కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 01 (జనంసాక్షి) :**

నల్లగొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి నివాసం పై కాంగ్రెస్ శ్రేణులు దాడి చేసిన నేపథ్యంలో పరామర్శించేందుకు వెళ్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావును పోలీసులు అక్రమంగా హౌస్ అరెస్ట్ చేయడాన్ని, కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ఇటువంటి అప్రజాస్వామిక చర్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని, రామచందర్రావు అరెస్టు దుర్మార్గమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం అన్నారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్రావు అక్రమ హౌస్ అరెస్టును ఖండిస్తూ, జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం రోజున కరీంనగర్లోని తెలంగాణ చౌక్ లో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం మాట్లాడుతూ... రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా కక్షసాధింపు రాజకీయాలకు పాల్పడుతోందని ఆరోపించారు. బీజేపీకి రాష్ట్రంలో రోజురోజుకూ పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేకనే, అధికార పార్టీ నేతలు అరాచకాలకు దిగుతున్నారని విమర్శించారు.



నల్లగొండలో బీజేపీ జిల్లా అధ్యక్షుడి కుటుంబ సభ్యుల పై, ఆయన తల్లి పై భౌతిక దాడులు చేసిన గూండాలను వదిలేసి, బాధితులను పరామర్శించడానికి వెళ్తున్న రాష్ట్ర అధ్యక్షుడిని గృహనిర్బంధం చేయడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎమర్జెన్సీని మించిన అరాచక పాలన సాగుతోందని, శాంతిభద్రతలను కాపాడటంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మల్లేశం మండిపడ్డారు. దాడులకు పాల్పడిన కాంగ్రెస్ నాయకులను తక్షణమే అరెస్ట్ చేయాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ శ్రేణుల ఆధ్వర్యంలో ఉధృతమైన ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు. అరెస్టులకు బిజెపి భయపడదని, ప్రభుత్వ నిరంకుశ, ప్రజావ్యతిరేక విధానాల పై తమ పోరాటం నిరంతరం కొనసాగుతుందని సాయిని మల్లేశం స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు కన్నబోయిన ఓదెలు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుగొండ నాగేశ్వర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్ రెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు, జిల్లా ఉపాధ్యక్షులు ఎర్రవెల్లి సంపత్ రావు, గుజ్జ శ్రీనివాస్ రావు, వైద రామానుజమ్, నాంపల్లి శ్రీనివాస్, సిహెచ్ నరసింహ రాజు, కనుమల్ల గణపతి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం రద్దు చేయాలి

చొప్పదండి, సెప్టెంబర్ 1(జనం సాక్షి):



పదవి విరమణ అనంతరం ఉద్యోగుల ఆర్థిక భద్రతకు శాపంగా మారిన కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం రద్దు చేయాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు ముల్కల విజయ్ డిమాండ్ చేశారు . టీజీఈ జెఎసి పిలుపుమేరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు కళాశాలలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి ఉద్యోగులు, ఉపాధ్యాయులు తమ నిరసన వ్యక్తం చేశారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ముల్కల విజయ్ కుమార్ మాట్లాడుతూ 2004లో అప్పటి వైఎస్ సర్కార్ సెప్టెంబర్ 1న రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరికీ సీపీఎస్‌ను వర్తింపజేస్తూ జీవో–653 జారీ చేసి రాష్ట్రంలోని ఉద్యోగులందరినీ రోడ్డున పడేసిందన్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు సీపీఎస్‌ను రద్దుచేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడిచినప్పటికీ మౌనం పాటిస్తుందన్నారు. 2003లో నోటిఫికేషన్లు విడుదలై,ఆతర్వాత నియమితులైన ఉద్యోగులకు పాత పింఛన్ అమలు చేయాలని ఇటీవలే హైకోర్టు తీర్పునిచ్చినా సర్కార్ ఖాతరు చేయడం లేదన్నారు. సీపీఎస్‌ను రద్దు చేస్తామన్న హామీతో రాజస్థాన్,ఛత్తీస్‌గఢ్, హిమాచల్‌ప్రదేశ్‌లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వాలు సీపీఎస్‌ను రద్దు చేశాయని కానీ,తెలంగాణలో రద్దు చేయకపోవడంతో ఉద్యోగుల్లో అసహనం, ఆగ్రహజ్వాలలు మిన్నంటుతున్నందున వెంటనే సిపిఎస్ ను రద్దుచేసి పాత పెన్షన్ విధానం పునరుద్ధరించి ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

## కథలాపూర్ లో బీజేపి నాయకుల నిరసన

**కథలాపూర్ సెప్టెంబర్ 1 (జనంసాక్షి)**



భారతీయ జనతా పార్టీ కథలాపూర్ మండల శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో బీజేపి నాయకులు నిరసన వ్యక్తం చేసారు. మండల అధ్యక్షులు మల్యాల మారుతి మాట్లాడుతూ హైదరాబాద్ లోని నాంపల్లిలో బీజేపి రాష్ట్ర కార్యాలయం పైన కాంగ్రెస్ కార్యకర్తల దాడి చేయడం దారుణమని కాంగ్రెస్ నాయకుల తీరును కండించారు,దాడికి ప్రతిదాడి తొందర్లోనే ఉంటదని అలాగే కాంగ్రెస్ డౌన్ డౌన్, ఖబర్దార్ కాంగ్రెస్ నాయకుల్లారా అంటూ నినాదాలు చేసారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బద్రి సత్యం,గాందారి శ్రీనివాస్,సర్పంచ్ మల్యాల రమేష్, కాసోజి ప్రతాప్,కథలాపూర్ మహేష్, జీవన్ రెడ్డి,ప్రసాద్,ప్రమోద్, మహేష్, సాయిరెడ్డి,కిషోర్,రాజశేఖర్, వినోద్,అనీల్,కిషోర్,శ్రీకర్, ప్రభూ, సురేష్, రవి,రత్నాకర్ శ్రీకాంత్, బూమయ్య, టీ.మహేష్,అనుదీప్,తిరుపతి,రాజం,పాల్గొన్నారు.

# పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

**సీపీఎస్ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు అయ్యన్నగారి హరికృష్ణారెడ్డి**



**ఇల్లంతకుంట సెప్టెంబర్ 01 (జనంసాక్షి ):** రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన విధంగా నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని వెంటనే పునరుద్ధరించాలని సీపీఎస్ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు అయ్యన్నగారి హరికృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. పెన్షన్ విద్రోహ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం జడ్పీహెచ్ఎస్ వెల్జీపూర్ పాఠశాలలో భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు, ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా హరికృష్ణారెడ్డి మాట్లాడుతూ నూతన పెన్షన్ విధానం వల్ల ఉపాధ్యాయులు, ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగ భద్రత లేకపోవడంతో ఉద్యోగులు మానసిక క్షోభకు గురవుతున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 2.70 లక్షల మంది ఉద్యోగుల కుటుంబాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఆయన కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాట్నపల్లి స్వామిరెడ్డి, ఉపాధ్యాయులు కుమారస్వామి, రాజిరెడ్డి, శ్రీనివాస్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అన్నపూర్ణ, ఉపాధ్యాయులు అరుణ, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణను మమతా బెనర్జీ పాలనను తలపించే మరో పశ్చిమ బెంగాల్‌గా మార్చే ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదు

**బీజేపి మండల అధ్యక్షులు దెంచనాల శ్రీనివాస్**



**సైదాపూర్ సెప్టెంబర్ 1( జనంసాక్షి)**

సైదాపూర్ మండల కేంద్రంలో బిజెపి అధ్యక్షుడు దంచనాల శ్రీనివాస్ సోమవారం రోజునా విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై కాంగ్రెస్ మూకల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం బీజేపీ ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటం చేస్తుంటే, సమాధానం చెప్పలేని కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ కక్షతో భౌతిక దాడులకు దిగడం అత్యంత హేయమైన చర్య.ప్రజా సమస్యలపై ప్రశ్నించే ప్రతిపక్షంపై దాడులు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. అధికారంలో ఉన్న ప్రభుత్వం విమర్శలను స్వీకరించి, సమస్యలకు పరిష్కారం చూపాలి కానీ దాడులు, బెదిరింపులతో ప్రజల గొంతును అణచివేయాలని చూడటం సరికాదు.ఒక జాతీయ పార్టీ రాష్ట్ర కార్యాలయానికే రక్షణ లేకపోతే, రాష్ట్రంలోని సామాన్య ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి భద్రత కల్పిస్తుందో ప్రజలు ఆలోచిస్తున్నారు.తెలంగాణలో శాంతిభద్రతలు రోజురోజుకూ దెబ్బతింటున్నాయనే ఆందోళన ప్రజల్లో నెలకొంది. రాజకీయ ప్రత్యర్థులపై దాడులను అరికట్టి, దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలి.ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం, విద్యార్థులు మరియు ప్రజల హక్కుల కోసం భారతీయ జనతా పార్టీ నిరంతరం పోరాడుతూనే ఉంటుందన్నారు

# గూడూరు గ్రామానికి గుండె కాయ ఈపల్లగుట్ట

**తవ్వకాలను నిలిపి వేయాలని గ్రామస్తుల డిమాండ్**



**ముస్తాబాద్ సెప్టెంబర్ 01 జనంసాక్షి**

ముస్తాబాద్ మండలం గూడూరు, నామాపూర్ గ్రామానికి అనుకొని వున్న పల్లగుట్ట అంటే మాకు పంచప్రాణం తవ్వకాలను వెంటనే నిలిపివేయకపోతే ఎంత వరకైన తెగిస్తాం,ఏమైనా చేస్తాం,తగ్గేదే లేదు అని గూడూరు మాజీ సర్పంచ్ సాకలి రమేష్, గ్రామస్తులు అంటున్నారు. పల్లగుట్టపైన మంగళవారం గూడూరు గ్రామస్తులు శాంతియుత నిరసన కార్యక్రమాము చేపట్టారు.ఈ సందర్భంగా గూడూరు గ్రామస్తులు మాట్లాడుతూ రంగురాళ్ళు వున్నాయని కలరింగ్ వేస్తూ గుట్టను ధ్వంసం చేస్తున్నారు.మా గూడూరు గ్రామానికి గుండెకాయ ఈపల్లగుట్ట ను ధ్వంసం చేస్తే చూస్తూ ఊరుకోమని గ్రామస్తులు అన్నారు.గుట్టను ధ్వంసము చేస్తే ఒకరు లాభపడతారు.గుట్ట వుంటే 10 గ్రామాలు రక్షణ పొందుతాయని గ్రామస్తులు తమ బాధను మీడియాకు తెలియజేశారు.గుట్టపైన అనేక రకాల జంతువులు జింకలు,కుందేళ్ళు,అడవి పందులు,మల్లికార్జున స్వామి,నరసింహ స్వామి దేవాలయాలు వున్నాయనీ వీటి రక్షణ కొరకు సిరిసిల్ల నియోజక వర్గ ఎమ్మెల్యే కేటీఆర్ చొరవ తీసుకుని తవ్వకాలను వెంటనే నిలిపివేయాలని అన్నారు.ఇప్పుడున్న ప్రభుత్వం మాటల్లతో గెలిచి మాకే తూట్లు పొడుస్తున్నారనీ గూడూరు గ్రామ ప్రజలు తమ ఆవేదనను వ్యక్తం చేశారు.ఇందిరా గాంధీ ఆ కాలములో ఈ గుట్టపైన కన్నువేస్తే ఇప్పుడు తవ్వకాలు చేస్తున్నారని గీసా భిక్షపతి అన్నారు.కేటీఆర్,కేకే మహేందర్ రెడ్డిల ఇలాకాలో ఇలా జరగడం చాలా బాధాకరం అని, పార్టీలు వేరైనా ప్రాంతము ఒక్కటేనని భావించి వీరిద్దరూ చొరవ తీసుకొని పల్లగుట్ట తవ్వకాలు నిలిపి వేయాలని మార్వాడి సుదర్శన్ అన్నారు.ఇప్పటికే గూడూరు గ్రామము జిల్లాలో మద్యపాన నిషేధ,ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుకున్నామని,గుట్ట తవ్వకాలతో గ్రామ పర్యావరణం దెబ్బతినే అవకాశం ఉందని గూడూరు మాజీ సర్పంచ్ చాకలి రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమములో దళిత లిబరేటివ్ జనరల్ సెక్రెటరీ మార్వడి సుదర్శన్,జిల్లా మాజీ కార్యదర్శి గుంటి వేణు,ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు కుర్ర రాకేష్, సి ఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు గీసా భిక్షపతి,అల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర కార్యదర్శి అంబటి జొహాజీ రెడ్డి,గూడూరు గ్రామ మాజీ సర్పంచ్ చాకలి రమేష్,చెరుకు ఎల్లం,గౌడ సంఘం అధ్యక్షులు సంతోష్, షేక్ అబ్బాస్, గ్రామస్తులు,నాయకులు పాల్గొన్నారు.

## హిమ్మత్ నగర్ ప్రభుత్వ పాఠశాలలో

# ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు



**వీణవంక సెప్టెంబర్ 1 (జనంసాక్షి)**

వీణవంక ఎంపీ,యుపీఎస్ హిమ్మత్ నగర్ ప్రభుత్వ పాఠశాలలో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించు కోవడం జరిగింది.ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ జడల శ్రీకాంత్,ఉప సర్పంచ్ మ్యాక శ్రీనివాస్ వార్డు సభ్యులు,ప్రత్యేక ఆహ్వానితులుగా గన్నుకుల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ హాజరయ్యారు.ఈ వేడుకలను గ్రామ సర్పంచ్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు గోపికమ్మల వేషాలతో శ్రీకృష్ణుని వేషాలతో చాలా చక్కగా తయారై వచ్చారు మంచి మంచి పాటలతో నృత్యాలు చేస్తూ కృష్ణాష్టమి వేడుకల్ని జరుపుకున్నారు. కార్యక్రమంలో భాగంగా ఉట్టికొట్టే కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.చిన్ని కృష్ణులు ఉట్టికొట్టే సందర్భం చాలా వేడుకగా జరుపుకోవడం జరిగింది.ఈ కార్యక్రమానికి వార్డ్ సభ్యులు చిలువేరు స్వప్న రమేష్,బొంతల రవి, రావుసాల వినోద,పాఠశాల చైర్మన్ రజిత,గట్టయ్య సీనియర్ ఉపాధ్యాయులు వేణు,రవళి,రజిత ప్రియాంక గ్రామ ప్రజలు అంగన్వాడి కార్యకర్తలు లావణ్య స్వరూప ఆయమ్మలు రాధమ్మ సమ్మక్క విద్యార్థుని విద్యార్థులు పాల్గొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోనె సత్యం మాట్లాడుతూ కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు పాలకవర్గానికి కృతజ్ఞతలు తెలియజేశారు.

# రచయితలు కూడా సమాజానికి వైద్యులే : డాక్టర్ గుండ్లూరి సురేంద్రబాబు



ముస్తాబాద్ సెప్టెంబర్ 01 (జనం సాక్షి) సమాజ హితం కోరేదే సాహిత్యమని, ఉత్తమ రచనలతో సమాజంలోని రుగ్మతలను తొలగించే సాహిత్యకారులు కూడా సమాజానికి వైద్యులేనని తెలంగాణ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ప్రముఖ పిల్లల వైద్య నిపుణుడు, రచయిత డాక్టర్ గుండ్లూరి సురేంద్రబాబు అన్నారు. సిరిసిల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలంగాణ సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సాహిత్యంపై ఒకరోజు శిక్షణ కార్యశాలను నిర్వహించగా, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ సురేంద్రబాబు మాట్లాడుతూ వైద్యులు మందులతో శారీరక రుగ్మతలను నయం చేస్తే. రచయితలు తమ ఆలోచనాత్మక రచనల ద్వారా సామాజిక రుగ్మతలను తొలగించి ప్రజల్లో చైతన్యం తీసుకొస్తారని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ప్రముఖ కథా రచయిత డాక్టర్ పెద్దింటి అశోక్‌కుమార్ కథలు రాయడం ఎలా అనే అంశంపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. నిశిత పరిశీలన, సమాజం పట్ల బాధ్యత, భావ వ్యక్తీకరణ నైపుణ్యాలు ఉత్తమ కథకు పునాదులని వివరించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ సారస్వత పరిషత్ సంచాలకులు, రచయిత గరిపల్లి అశోక్, కళాశాల ప్రిన్సిపాల్ విజయ రఘునందన్, తెలుగు అధ్యాపకులు సామల వివేకానంద్‌తో పాటు అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# సిపిఎస్ రద్దుచేసి ఓపిఎస్ అమలు చేయాలి

**- నల్ల బ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన**




రుద్రంగి, సెప్టెంబర్ 1 (జనం సాక్షి) కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని వెంటనే రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాల ఉపాధ్యాయులు సోమవారం నిరసన తెలిపారు.తెలంగాణ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి పిలుపు మేరకు సెప్టెంబర్ ఒకటవ తేదీని సిపిఎస్ ద్రోహ దినంగా పాటిస్తూ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. విద్యార్థుల చదువుకు ఆటంకం కలగకుండా భోజన విరామ సమయంలో పాఠశాల ఆవరణలో నిరసన చేపట్టి, సిపిఎస్ రద్దు చేయాలంటూ నినాదాలు చేశారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రెండు లక్షల అరవై వేల మంది ఉద్యోగులు సిపిఎస్ వల్ల నష్టపోతున్నారని, కేంద్ర ప్రభుత్వం తెచ్చిన యుపిఎస్, రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్న జిపిఎస్ తమకు ఆమోదయోగ్యం కాదని తెలిపారు. పెండింగ్లో ఉన్న పీఆర్సీ, ఆరు డీఏలను వెంటనే విడుదల చేయాలని కోరారు.ప్రభుత్వం స్పందించకపోతే సెప్టెంబర్ ఆరవ తేదీన హైదరాబాద్ ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ లో జరిగే చలో హైదరాబాద్ సంకల్ప సభలో పాల్గొంటామని హెచ్చరించారు.

### హుజూరాబాద్ మున్సిపల్ అభివృద్ధికి

# నిధులు మంజూరు చేయండి

- హుజూరాబాద్ ఇంచార్జి వొడితల ప్రణవ్ ఆధ్వర్యంలో మంత్రి శ్రీధర్ బాబును కలిసిన మున్సిపల్ పాలకవర్గం
- సానుకూలంగా స్పందించిన మంత్రి, సంబంధిత అధికారులకు ఆదేశం



**హుజూరాబాద్, సెప్టెంబర్ 1 (జనంసాక్షి) :**
హుజూరాబాద్ మున్సిపల్ అభివృద్ధికి నిధులు కేటాయించాలని హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ ఆధ్వర్యంలో మంత్రి శ్రీధర్ బాబును హైదరాబాద్ లోని మినిస్టర్ క్వార్టర్స్ తన నివాసంలో కలిశారు హుజూరాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ సుహాసిని,కౌన్సిలర్లు,కో ఆప్షన్ సభ్యులు..సానుకూలంగా స్పందించిన మంత్రి హుజూరాబాద్ మున్సిపల్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని,దానికి తగ్గట్టుగా నిధులు కేటాయిస్తామని తెలిపారు.ఈ సందర్భంగా పాలకవర్గాన్ని మంత్రి అభినందించారు.ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ మున్సిపల్ పాలకవర్గం పాల్గొన్నారు.

# తక్షణమే ఒక లక్ష 50 వేల రూపాయలు నిధులు మంజూరు..

**సంఘ అభివృద్ధికి నిధులు మంజూరు కృషి చేస్తా : ఎమ్మెల్యే డాక్టర్. సంజయ్ కుమార్..**

**రాయికల్ సెప్టెంబర్1 జనంసాక్షి**
మంగళవారం జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్. సంజయ్ కుమార్ క్యాంప్ కార్యాలయంలో అల్లీపూర్ గ్రామానికి చెందిన కుమ్మరి సంఘ భవనం అభివృద్ధికి సంబంధించిన వినతి పత్రం గ్రామ కాంగ్రెస్ కుటుంబ సభ్యులు మరియు కుమ్మరి సంఘం సభ్యుల ఆధ్వర్యంలో సంఘ అభివృద్ధికి నిధులు మంజూరు చేయగలరని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కి విన్నవించడం జరిగింది . ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి తక్షణమే ఒక లక్ష 50 వేల రూపాయలు బోరు మరియు దానికి సంబంధించిన మోటర్కు నిధులు మంజూరుకు హామీ ఇవ్వడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎంబారి గౌతమి వెంకటేష్,కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి ఎంఏ ముఖీద్, గ్రామ మాజీ ఉప సర్పంచ్ సాగర్ రావు, స్పందన,స్థానిక వార్డ్ మెంబర్ అట్మాపురం భవాని గంగ శేఖర్, స్థానిక నాయకులు వేముల సతీష్ శ్రీరాముల గణపతి దోబ్బల వేణు, దాసారపు వేణు రావు,సంఘ అధ్యక్షులు అట్మాపురం గంగారం



ఉపాధ్యక్షులు గంగ శేఖర్ సభ్యులు అట్మాపురం నరసన్న బక్కన్న ,రెడ్డి, గంగారం, నడిపన్న,లింగన్న, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## సిపిఎస్ రద్దు కోసం చలో హైదరాబాద్..

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 1 (జనంసాక్షి)**
పీఆర్టీయూ టీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్ లోని ఇందిరాపార్క్ వద్ద సిపిఎస్ రద్దు ధర్నా కోసం వేములవాడ నుండి నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా పిఆర్టియు టీఎస్ రాష్ట్ర అసోసియేటెడ్ అధ్యక్షులు చిప్ప యాదగిరి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా సిపిఎస్ రద్దుచేసి తననిబద్ధతను చాటుకోవాలన్నారు.పెండింగ్ లో ఉన్న 6 డిఏ లను తక్షణమే ప్రకటించి పెరుగుతున్న ధరలకు అనుగుణంగా రెండవ పిఆర్సిని దసరా లోపు ప్రకటించాలని డిమాండ్ చేశారు.విద్యాశాఖలో ఏర్పడిన అన్ని రకాల పదోన్నతులను ఇవ్వాలని అయన డిమాండ్ చేశారు. ఆయన వెంట మానువాడ శంకర్, చిట్నేని శ్రీకాంత్ రావు,గోశిక మధు,జిల్లా అసోసియేటెడ్ అధ్యక్షులు మడిశెట్టి మహేష్, కోతోజు రమేష్, గడప మధుకర్, గద్దంరాజేశం,రఘునాథ్ పాల్గొన్నారు.





## సి.పి.ఎస్ ని రద్దు చేసి ఓ పి ఎస్ ని పునరుద్దరించాలని నిరసన వ్యక్తం చేసిన పంచాయతీ కార్యదర్శులు..

**రాయికల్ సెప్టెంబర్ 1 జనంసాక్షి:**
రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ అయినా ప్రభుత్వ ఉద్యోగులకు ప్రస్తుతం అమలు చేస్తున్న సి.పి.ఎస్ ని రద్దు చేసి ఓ పి ఎస్ ని పునరుద్దరించాలని టి జి ఈ జె ఎ సి ఆధ్వర్యంలో రాయికల్ మండల ప్రజా పరిషత్ కార్యాలయం లో ఎంపీడీఓ చిరంజీవి అధ్యక్షతన భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జెస్ ధరించి పెన్షన్ విద్రోహ దినం రోజుగా నిరసన వ్యక్తం చేశారు.ఈ నెల 10 న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎంపీవో సుష్మ , మండల పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# అధ్యాపకుల నిరసన

**మల్లాపూర్, సెప్టెంబర్ 01(జనంసాక్షి)**
సీపీఎస్ ను రద్దు చేయాలని, ఓపీఎస్ ను పునరుద్దరించాలని డిమాండ్ చేస్తూ మల్లాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపక బృందం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఉద్యోగుల జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు సెప్టెంబర్ 1న సీపీఎస్ విద్రోహ దినంగా పాటించాలని అన్నారు. అలాగే పెండింగ్ లో ఉన్న ఉద్యోగుల 2వ పీఆర్సీ, 6డీఏలు వెంటనే విడుదల చేయాలని, వీటితో పాటు సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలనే నినాదాలు చేశారు. కావున తక్షణమే ప్రభుత్వం స్పందించి తమ డిమాండ్స్ ను పరిష్కరించాలని తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్ అసోసియేషన్ - 711 రాష్ట్ర ఉపాధ్యక్షులు నంచర్ల రాజేష్ కోరారు. ఈ కార్యక్రమంలో ఁఉఓం -711 జిల్లా ఉపాధ్యక్షులు ం. శ్రీనివాస్ ం.నరేష్ మరియు కార్యదర్శి ఖ. మహేష్ తో పాటు అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## ఘనంగా పంచాయతీరాజ్ డిప్యూటీ ఈ ఈ కి వీడ్కోలు సన్మానించిన సర్పంచ్లు

మల్లాపూర్ మండల కేంద్రంలో పంచాయతీ రాజ్ విభాగంలో నలభై ఏళ్లుగా సేవలందించి మంగళవారం రిటైర్ అయిన అన్వర్ వీడ్కోలు సభలో మల్లాపూర్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ చిట్యాల లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. పంచాయతీరాజ్ విభాగంలో విశిష్ట సేవలు అందించిన అన్వర్ ను సేవలు మరువలేనివని సర్పంచ్ అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి సంధి రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, పెద్దిరెడ్డి లక్ష్మణ్, మకిలి రాకేష్,కోడూరి బిక్షపతి, లవంగ శ్రీనివాస్, పోచంపల్లి బుచ్చి రమేష్,బొక్కల నాగరాజు,సామాజిక కార్యకర్త ఏనుగు వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



**ప్రజాపాలనకు 1000 రోజులు..**

# వేములవాడ అభివృద్ధికి ఆది శ్రీనివాస్ అహర్నిశలు కృషి..

- ఆదికి మంత్రి పదవి రావాలి..
- జిల్లా ఉపాధ్యక్షుడు కూరగాయల కొమురయ్య

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 1 (జనంసాక్షి)**
ప్రజాపాలన 1000 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు, ప్రభుత్వ విప్, ఆది శ్రీనివాస్కు కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కూరగాయల కొమురయ్య శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో తెలంగాణలో ప్రజా పాలనకు కొత్త నిర్వచనం లభించిందన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పేదలు, రైతులు,మహిళలు,యువత, విద్యార్థులు,కార్మికులు, బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగుతోందన్నారు.కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటున్న ప్రభుత్వం అన్నారు.

**వేములవాడ అభివృద్ధికి ఆది శ్రీనివాస్ ఒక శక్తి..**
వేములవాడ నియోజకవర్గ అభివృద్ధి విషయంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక శ్రద్ధతో పనిచేస్తున్నారన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభివృద్ధికి దిశానిర్దేశం చేస్తుంటే, వేములవాడ నియోజకవర్గంలో ఆది శ్రీనివాస్ ఆ అభివృద్ధిని ప్రజల గడప వద్దకు తీసుకెళ్లే బాధ్యతను భుజాన వేసుకున్నారన్నారు.ఆది శ్రీనివాస్కు పదవి కంటే ప్రజలే ముఖ్యమని, ప్రజా సమస్యలే తన ఎజెండాగా పనిచేస్తున్నారన్నారు.కలికోట సూరమ్మ చెరువు ప్రాజెక్టు పనులను ముందుకు తీసుకెళ్లడం ద్వారా సాగునీటి రంగానికి బలం చేకూరుస్తున్నారన్నారు.రైతుల సాగునీటి అవసరాలను తీర్చడమే లక్ష్యంగా ప్రాజెక్టు పనులు కొనసాగుతున్నాయన్నారు.

**రాజన్న ఆలయ అభివృద్ధికి ప్రత్యేక ముద్ర..**
వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి విషయంలోనూ ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవ చూపుతున్నారన్నారు.రాజన్న ఆలయానికి వచ్చే లక్షలాది మంది భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు ఆలయ పరిసరాలను మరింత అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ఆయన కృషి చేస్తున్నారని తెలిపారు. ఆలయం ముందు స్థల సేకరణ,రోడ్ల విస్తరణ వంటి పనులతో వేములవాడ పట్టణ అభివృద్ధికి కొత్త రూపు వస్తోందన్నారు.రెండో వంతెన నిర్మాణం పూర్తి కావడం వేములవాడ ప్రజలకు ఎంతో ఉపయోగకరమైన అభివృద్ధి కార్యక్రమమన్నారు.పట్టణంలో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపడంతో పాటు ప్రజల రాకపోకలకు మరింత సౌలభ్యం కలిగిందన్నారు.వేములవాడ అభివృద్ధి కోసం ప్రతి బడ్జెట్లో నిధులు సాధించేందుకు ఆది శ్రీనివాస్



చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. నియోజకవర్గ అవసరాలను సీఎం దృష్టికి తీసుకెళ్లి, అభివృద్ధి పనులకు నిధులు తీసుకురావడంలో ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు.

**అధిష్టానం గుర్తించాల్సిన సమయం వచ్చింది..**
ప్రజల్లో ఉంటూ ప్రజల కోసం పనిచేసే ఇలాంటి నాయకుడి సేవలను కాంగ్రెస్ పార్టీ అధిష్టానం గుర్తించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ప్రభుత్వ విప్గా పార్టీకి, ప్రభుత్వానికి సమన్వయకర్తగా పనిచేస్తూ ఎమ్మెల్యేగా నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ఆది శ్రీనివాస్కు భవిష్యత్తులో మరింత కీలకమైన బాధ్యతలు అప్పగించాలని కోరారు.ఆది శ్రీనివాస్కు మంత్రి పదవి లభిస్తే వేములవాడ నియోజకవర్గానికే కాకుండా ఉమ్మడి కరీంనగర్ ప్రాంతానికి మరింత ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఆయనకు ఉన్న పరిపాలనా అనుభవం, ప్రజలతో ఉన్న అనుబంధం, కార్యకర్తలపై ఉన్న మమకారం, అభివృద్ధిపై ఉన్న దృష్టి ప్రభుత్వానికి మరింత ఉపయోగపడుతుందన్నారు.

# బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవనంపై నిషేధాజ్ఞలు కొనసాగింపు..

◆ అనుమతి లేని డ్రోన్లు, డీజే సౌండ్స్‌పై కఠిన చర్యలు..

◆ రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో సిటీ పోలీస్ యాక్ట్ అమలు.. ◆ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా..



**గోదావరిఖని, జనంసాక్షి :** సాధారణ పౌరులు, ముఖ్యంగా మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల, పెద్దపల్లి జోన్‌లలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడంపై అమల్లో ఉన్న నిషేధాజ్ఞలను కొనసాగిస్తున్నట్లు రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు.బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి కొందరు వ్యక్తులు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారంటూ పలు ఫిర్యాదులు అందిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.మద్యం మత్తులో వీధులు, రహదారులపై అసభ్య పదజాలంతో ప్రవర్తించడం వల్ల ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలుగుతోందని,ప్రజల భద్రత దృష్ట్యా ఈ నిషేధాజ్ఞలు విధించినట్లు పేర్కొన్నారు.ఈ నిషేధాజ్ఞలు 01-09-2026 నుండి 01-10-2026 వరకు అమల్లో ఉంటాయని, పరిస్థితులను బట్టి కాలపరిమితిని పొడిగించే అవకాశం ఉందని తెలిపారు.భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 223, హైదరాబాద్ సిటీ పోలీస్ యాక్ట్,1348 ఫసలీ నిబంధనల ప్రకారం నిషేధాజ్ఞలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**డీజే సౌండ్స్, డ్రోన్లపై నిషేధాజ్ఞల పొడిగింపు**

రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల,పెద్దపల్లి జోన్‌లలో డీజే సౌండ్స్ వినియోగంపై అమల్లో ఉన్న నిషేధాజ్ఞలను పొడిగించినట్లు పోలీస్ కమిషనర్ తెలిపారు.ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసినట్లు పేర్కొన్నారు.చిన్నపిల్లలు, వృద్ధులు,రోగులు, విద్యార్థుల విద్యాభ్యాసానికి భంగం కలగకుండా,శబ్ద కాలుష్యాన్ని నివారించేందుకు అధిక శబ్దంతో కూడిన డీజే సౌండ్స్ వినియోగంపై నిషేధం విధించినట్లు తెలిపారు.వివిధ కార్యక్రమాల సందర్భంగా ప్రజలను సమీకరించేందుకు డీజే సౌండ్స్ వినియోగిస్తున్నట్లు గమనించామని పేర్కొన్నారు.అయితే, కార్యక్రమాల నిర్వాహకులు మైక్ సెట్ అవసరమైతే సంబంధిత డివిజన్ ఏసీపీ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు.మైక్ సెట్ వినియోగానికి సంబంధించి నిర్దిష్ట మార్గదర్శకాలు ఉన్నాయని తెలిపారు.ఈ నిషేధాజ్ఞలు కూడా 01-09-2026 నుండి 01-10-2026 వరకు అమల్లో ఉంటాయని, పరిస్థితులను బట్టి కాలపరిమితిని పొడిగించే అవకాశం ఉందని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 223, హైదరాబాద్ సిటీ పోలీస్ యాక్ట్, 1348 ఫసలీ నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో సిటీ పోలీస్ యాక్ట్ అమలు:**

రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జోన్‌లలో రామగుండం పోలీస్ కమిషనరేట్ యాక్ట్-2016లోని సెక్షన్ 7(1), సెక్షన్ 22(1)(ఏ) నుండి (ఎఫ్), సెక్షన్ 22(2)(ఏ), (ఎ), సెక్షన్ 22(3), సిటీ పోలీస్ యాక్ట్, 1348 నం.9 ఫసలీ, సెక్షన్ 30, పోలీస్ యాక్ట్--1861 ప్రకారం 01-09-2026 ఉదయం 6.00 గంటల నుండి 01-10-2026 ఉదయం 6.00 గంటల వరకు నిషేధాజ్ఞలు అమల్లో ఉంటాయని పోలీస్ కమిషనర్ తెలిపారు.ఈ కాలంలో రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఎలాంటి ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు.ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించాలంటే ముందుగా సంబంధిత పోలీస్ అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు.బంద్‌ల పేరుతో సంస్థలు,కార్యాలయాలను బలవంతంగా మూసివేయించడం,ఒత్తిడి చేయడం లేదా బెదిరింపులకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.శాంతిభద్రతల పరిరక్షణలో పోలీస్ శాఖకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని పోలీస్ కమిషనర్ కోరారు.

# రామగుండం నవనిర్మాణ నాయకుడికి జననీరాజనం

- వెయ్యి రోజుల ప్రజాపాలనకు ఘన స్వాగతం.. - 1500 మందితో 'ఖని'లో భారీ ర్యాలీ..

**గోదావరిఖని, జనంసాక్షి :** వెయ్యి రోజుల ప్రజాపాలనలో రామగుండం నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో పరుగులు పెట్టిస్తున్న రామగుండం నవనిర్మాణ నాయకుడు, రథసారథి ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్‌కు అడుగడుగునా ప్రజలు నీరాజనాలు పలికారు. నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొంతల రాజేష్‌ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ ర్యాలీకి ప్రజలు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,వివిధ సామాజిక, కార్మిక, వర్తక, వాణిజ్య సంఘాల ప్రతినిధులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.స్థానిక ప్రధాన చౌరస్తా నుంచి ప్రారంభమైన ఈ భారీ ర్యాలీ రీగల్ షూ మార్ట్ సెంటర్, లక్ష్మీనగర్, టీ జంక్షన్, కళ్యాణ్‌నగర్ చౌరస్తా, సిటీ స్కాన్ సెంటర్, డాక్టర్స్ స్ట్రీట్, ఓల్డ్ అశోక్ సెంటర్ మీదుగా తిరిగి ప్రధాన చౌరస్తాకు చేరుకోవడంతో ఘనంగా ముగిసింది.

**అభివృద్ధి బాటలో రామగుండం..**

ర్యాలీ సందర్భంగా లక్ష్మీనగర్ టీ-జంక్షన్ వద్ద ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ ప్రజలనుద్దేశించి ప్రసంగించారు.కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల ప్రజాపాలనలో రామగుండం నియోజక వర్గంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. రామగుండం భవిష్యత్ అభివృద్ధికి చేపట్టబోయే మరిన్ని కార్యక్రమాలను సైతం వెల్లడించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మాట్లాడుతూ 'తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి వర్యులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సహకారం, మార్గదర్శకత్వం తోనే రామగుండం నియోజకవర్గం అభివృద్ధి బాటలో శరవేగంగా ముందుకు సాగుతోందన్నారు.రాష్ట్ర ప్రభుత్వం రామగుండం నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు సహకారంతో నియోజకవర్గానికి పెద్ద ఎత్తున నిధులు, అభివృద్ధి కార్యక్రమాలు తీసుకురాగలుగుతున్నామని తెలిపారు.

**రూ.900 కోట్లతో అభివృద్ధి పనులు..**

కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలనలో భాగంగా రామగుండం నియోజకవర్గంలో దాదాపు రూ.900 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ తెలిపారు."రామగుండం అభివృద్ధి ఒక్కరి వల్ల సాధ్యమైంది కాదు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సహకారం,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తల కృషి,ముఖ్యంగా రామగుండం ప్రజల ఆశీర్వాదంతోనే ఈ అభివృద్ధి సాధ్యమవుతోంది.భవిష్యత్‌లో రామగుండాన్ని మరింత అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామన్నారు.

**ప్రతిపక్షాల విమర్శలకు ఘాటైన కౌంటర్..**

రామగుండంలో జరుగుతున్న అభివృద్ధిపై అవగాహన లేకుండా ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ తిప్పికొట్టారు.'ప్రతిపక్షాలు విమర్శలు చేయడం కాదు..ఒక్కసారి రామగుండం వీధుల్లోకి వచ్చి జరుగుతున్న అభివృద్ధిని చూస్తే వాస్తవం ఏంటో వారికి అర్థమవుతుంది. ప్రజల కళ్లముందు జరుగుతున్న అభివృద్ధే మా పాలనకు నిదర్శనం"అని అన్నారు. వెయ్యి రోజుల ప్రజాపాలనను ఆశీర్వదించిన రామగుండం నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ శిరస్సు వంచి నమస్కారాలు తెలిపారు.మీ ఆశీర్వాదం, సహకారంతోనే భవిష్యత్‌లో మరింత సమర్థవంతమైన ప్రజాపాలన అందిస్తాం. కాంగ్రెస్ పార్టీ మరో ఎనిమిదేళ్ల ప్రజాపాలనను అందించేలా ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటాం అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఎప్పటిలాగే ప్రజా క్షేత్రంలో ఉంటూ మరింత సమయాన్ని ప్రజలకు కేటాయించాలని, అర్హులైన ప్రతి నిరుపేదకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు."కార్యకర్తలే కాంగ్రెస్ పార్టీకి అసలైన ఆస్తి. కార్యకర్తలకు, రామగుండం ప్రజలకు ఎల్లప్పుడూ అండగా, రక్షకుడిగా ఉంటాను" అని రాజ్‌ఠాకూర్ భరోసా ఇచ్చారు.

**అడుగడుగునా అభిమాన నీరాజనం..**

ప్రధాన వీధుల గుండా సాగిన ర్యాలీలో ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ గారికి వివిధ వర్గాల ప్రజలు ఘన స్వాగతం పలికారు. కాపు, ముదిరాజ్, గంగపుత్ర, మాల, మాదిగ సంఘాల ప్రతినిధులు, ఆటో యూనియన్ నాయకులు, బంగారం వ్యాపారులు,క్లోత్ మర్చంట్ యూనియన్ సభ్యులు,ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు, మైనారిటీ పెద్దలు, లారీ యజమానుల సంక్షేమ సంఘం ప్రతినిధులు, రజక సంఘం సభ్యులు శాలువాలు, పూలమాలలతో ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. అంతేకాకుండా ర్యాలీ సాగుతున్న సమయంలో ప్రజలు స్వచ్ఛందంగా తమ నివాస గృహాలపై నుంచి పూలు చల్లుతూ ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ గారిపై తమ అభిమానాన్ని, ఆదరణను చాటుకున్నారు. దీంతో రామగుండం ప్రధాన వీధులు కాంగ్రెస్ పార్టీ జెండాలు, నినాదాలతో మార్మోగాయి.1500 మందితో ర్యాలీ విజయవంతమైంది. ఈ కార్యక్రమం లో మేయర్ మహంకాళి స్వామి,మక్కాన్ సింగ్ సేవా సమితి చైర్ పర్సన్ మనాలి ఠాకూర్, సీనియర్ నాయకులు కాల్వ లింగస్వామి, రవి కుమార్, జిల్లా నాయకులు దీటి బాలరాజు, కార్పొరేటర్లు ఎండీ ముస్తఫా, గట్ల రమేష్,రాము, యుగేందర్, ఎం.ఏ. ఫజల్, సతీష్, సంతోష్‌రావు, చుక్కల శ్రీనివాస్, శ్రీనివాస్, సాంబమూర్తి, సత్యప్రసాద్, కొటం సతీష్, సిరిశెట్టి సతీష్, వడ్డూరి రవి, చిదురాల నాగరాజు, సహజ రాజేందర్, కొలని కవితరెడ్డి, బెంద్రం సునీతా-రాజిరెడ్డి, కన్నూరి భాగ్యలక్ష్మి-శంకర్, కందుల స్వరూప-సతీష్ తదితరులు పాల్గొన్నారు. మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు, స్వచ్ఛంద సంఘాల బాధ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు, పాల్గొన్నారు.



# ఆర్‌జీ-1 ఏరియా గనులపై టీబీజీకేఎస్ నిరసన..

**గోదావరిఖని, జనంసాక్షి :** సింగరేణిలో ప్రతి నెల మెడికల్ బోర్డు నిర్వహించి, అనారోగ్యంతో మెడికల్ బోర్డుకు దరఖాస్తు చేసుకున్న కార్మికులందరినీ అన్‌ఫిట్ చేయాలని డిమాండ్ చేస్తూ నల్ల బ్యాడ్జీలతో టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా ఆర్‌జీ-1 ఏరియాలోని జీడీకే. 1,2,2ఏ,జీడీకే. ఓసీపీ-5,జీడీకే. 11వ గనులు,ఏరియా వర్క్‌షాప్, సివిల్ డిపార్ట్ మెంట్, అనలాటికల్ ల్యాబ్‌లో ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా టీబీజీకేఎస్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నూనె కొమురయ్య, అధికార ప్రతినిధి పర్లపల్లి రవి మాట్లాడుతూ సింగరేణిలో రద్దు చేసిన డిపెండెంట్ ఉద్యోగాల స్థానంలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కారుణ్య నియామకాలు ప్రవేశపెట్టారన్నారు.తద్వారా 13 వేలకు పైచిలుకు కార్మికులను మెడికల్ 'ఇన్‌వ్యాలిడేట్' అయ్యారన్నారు.వేలాది కార్మిక కుటుంబాలకు న్యాయం జరిగిందని పేర్కొన్నారు.బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో దరఖాస్తు చేసుకున్న వారిలో 70% కార్మికులు మాత్రమే మెడికల్ అన్‌ఫిట్ అవుతున్నారని కాంగ్రెస్ పార్టీ, ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ సంఘాలు కార్మికుల ఎదుట మొసలి కన్నీరు కార్చుతున్నారు.ఎన్నికల్లో గెలిస్తే దరఖాస్తు చేసుకున్న కార్మికులకు నూటికి నూరు శాతం మెడికల్ అన్‌ఫిట్ చేయిస్తామని, ప్రతి నెల కనీసం మూడు మెడికల్ బోర్డులు నిర్వహిస్తామని హామీల వరద సృష్టించారని తెలిపారు.ఆచరణలో 10 శాతానికి మించి మెడికల్ అన్‌ఫిట్ జరగడం లేదన్నారు. ఇప్పటికైనా దరఖాస్తు చేసి మెడికల్ బోర్డు కోసం ఎదురుచూస్తున్న కార్మికుల కుటుంబాల భవిష్యత్తు దృష్ట్యా నిరంతరాయంగా మెడికల్ బోర్డు నిర్వహించి రోగాలతో బాధపడుతున్న వారందరినీ మెడికల్ ఇన్‌వ్యాలిడేట్ చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.అనంతరం హెచ్ఓడీకి వినతిపత్రం ఇవ్వడం జరిగిందన్నారు. టీబీజీకేఎస్ ఆర్‌జీ-1 ఉపాధ్యక్షులు వడ్డెపల్లి శంకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు మోదుంపెల్లి రాజేశం,దూట శేషగిరి,కొండ్ర అంజయ్య,మురళి కృష్ణ,ఉప్పులేటి తిరుపతి, పర్లపెల్లి అభిషేక్, మచ్చ దేవేందర్, భాస్కర్, దిడ్డి లక్ష్మణ్, అడ్డగట్ల గోపి, వాసర్ల జోసెఫ్, జనగామ ప్రమోద్, అంబటి శ్రీనివాస్, జనగామ మల్లేష్, పులిపాక శంకర్, అప్సర్, .రహమాన్, కొయ్యడ మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.